

ఆదివారం
30 జూన్, 2024
వార్త
NEET
PAPER LEAK !!
'నీట్'కు
సర్జరీ!


# రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా

# 'మిస్టర్ బచ్చన్'



రవితేజ హీరోగా, హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'మిరపకాయ్' తర్వాత ఈ ఇద్దరి కాంబోలో వస్తున్న చిత్రమిది. ఇందులో సీనియర్ నటుడు జగపతిబాబు రాజకీయ నాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సే తెలుగులో నటిస్తున్న తొలి చిత్రమిది. మిక్కీజే మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని పనోరమా స్టూడియోస్ అండ్ టీ సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.





# మరోసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్?

సూపర్ స్టార్ మహేశ్‌బాబు ప్రస్తుతం తన తరువాతి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నాడు. మహేశ్ కెరీర్‌లో **29**వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాను రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించేందుకు రెడీ అవుతున్నారు. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తరువాత మహేశ్ **30**వ చిత్రాన్ని రూపొందించేందుకు సుకుమార్, కొరటాల శివ, సందీప్‌రెడ్డి.. ఈ ముగ్గురిలో ఒకరు దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. ఇక ప్రిన్స్ **31**వ సినిమాను మరోసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వచ్చిన 'గుంటూరు కారం' బాక్సాఫీస్ వద్ద మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. దాంతో ఈసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం సిద్ధం చేయమని చెప్పినట్లు సమాచారం.

ఆదివారం వార్త

30 జూన్, 2024

## మంచి ముత్యాలు

ఆత్మీయులకు దూరంగా ఉండటం
మరణంకన్నా బాధాకరం.

- విలియం కూపర్

## విషయ విశేషం

ప్రకృతి కేకులు... 4

'సంఘీ'భావం....5

ప్రాణాలు హరిస్తున్న కల్తీ కల్లు

కవర్ స్టోరీ..6
'నీట్'కు
సర్జరీ!

అంతా ఉచితమిక్కడ..11

ఈవారం కవిత్వం..12

నవ్వుల నజరానా

మనసులను రంజింపచేసే వాయిద్యాలు..14

ప్రమాదంలో ఆధునిక జీవనశైలి!....18

కథ.. 20
ఒక్కొక్క మెట్టే

సాహిత్యం..24
తెలుగు వాకిలి-వెన్నెల లోగిలి

ప్రాచీన మసీదులు...26

వంట ఏ దిశలో చేయాలి?..29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## ఆ తీపితోను గుండెకు చేటు!



ఒకప్పుడు మధుమేహం ఉన్న వాళ్లు మాత్రమే 'షుగర్ ఫ్రీ' స్వీట్లవైపు వెళ్లేవారు. ఇప్పుడు ఏ ఆరోగ్య సమస్య లేకున్నా ఫిట్‌నెస్ కోసమంటూ వాటిని వాడుస్తున్నారు. అయితే, వైద్యుల సలహా లేనిదే వాటివైపు వెళ్లొద్దంటున్నారు పరిశోధకులు. ఎరిథ్రిటాలన, సుక్రలోజ్, జినిటాల్..మనం వాడుతున్న 'షుగర్‌లెస్' పదార్థాల్లో ఉపయోగించే ప్రధాన రసాయనాలు ఇవే. గత ఏడాది 'ఎరిథ్రిటాల్' వాడకానికీ హృద్రోగ సమస్యకీ సంబంధం ఉందని తేల్చారు శాస్త్రవేత్తలు. సుక్రలోజ్ అల్సర్ వంటి ఉదర సమస్యలకి దారితీస్తోందని ఈ ఏడాది ప్రారంభంలోనే తేల్చారు. ఇప్పుడు జినిటాల్ వంతు. దానిన స్వీటెనర్‌గా ఉపయోగిస్తున్న సుమారు 3300 మందిని ఈ పరిశోధనకు ఎంచుకున్నారు అమెరికాలోని ఒహాయో వర్సిటీ శాస్త్రవేత్తలు. ఎప్పటికప్పుడు వాళ్ల రక్తంలోని జినిటాల్ శాతాన్ని అంచనావేస్తూ వచ్చారు. మూడేళ్ల తర్వాత చూస్తే రక్తంలో మామూలుకన్నా జినిటాల్ శాతం ఎక్కువగా ఉన్నవారిలో గుండెపోటు ఏర్పడటాన్ని గమనించారు. అవి రక్తంలోని ప్లేట్‌లెట్‌లని గడ్డకట్టేలా చేస్తుండటమే ఇందుకు కారణమని తేల్చారు. కాబట్టి, నడివయసు దాటినవాళ్లు స్వీటెనర్‌ల మోతాదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

### వార్త లేఖ

2-6-2024 ఆదివారం అనుబంధంలో సంఘీ భావంలో 'సోషల్ మీడియాతో అనర్థాలు' బాగుంది. 'తోడేలుకు బుద్ధి వచ్చింది' పిల్లల కథ చదివించేలా ఉంది. అలాగే 'తండ్రి-బిడ్డలు' కథ ఆసక్తికరంగా ఉంది. ఇదేవారం 'నవ్వుల్..రువ్వుల్'లో నవ్వించే జోక్స్ ప్రచురించారు. 'నాదస్వరానికి చిరునామా' వ్యాసంలో మంచి సమాచారాన్ని అందించారు.

– వైదా ఈశ్వరరావు, విశాఖపట్నం

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com







# ప్రకృతి కేకులు



పిల్లల పుట్టినరోజు రాబోతున్నా..పెళ్లి రోజును సరదాగా సెలబ్రేట్ చేసుకోవాలనుకున్నా.. 'కేకుదేముంది ఎప్పుడు కావాలంటే అప్పుడు తెచ్చుకోవచ్చు. ముందు మిగతా ఏర్పాట్లను చూసుకోవాలి గానీ'..అని ఎవరూ అనుకోవడంలేదిప్పుడు. మిగిలిన ఏర్పాట్లూ, వేడుకకి తగినట్లుగా ఎంచుకునే దుస్తులూ ఎంత ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటున్నారో కేకును కూడా అంత కొత్తగా, ట్రెండీగా, మనసుకు నచ్చినట్లుగా డిజైను చేయించుకుంటున్నారు. ఇందులోనూ కస్టమైజేషన్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు. '3డీ నేచర్‌థీమ్ కేకులు' చేరిపోయి ప్రకృతి ప్రేమికులకు ఆనందాన్ని పంచుతూనే కేకు ప్రియుల్ని ఆనందాశ్చర్యాలకు గురిచేస్తున్నాయి. ఇంకెందుకు ఆలస్యం మీరూ కొనేయండి.












## 'సంఘీ' భావం



# ప్రాణాలు హరిస్తున్న కల్తీ కల్లు

తమిళనాడులో కల్తీ సారా తాగిన ఘటనలో పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరిగింది. ఎక్కువ మత్తు కలగాలన్న ఉద్దేశ్యంతో పరిధికి మించి రసాయనాలు కలుపుతుండటం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. తెలుగురాష్ట్రాల్లో నాటుసారా వినియోగం చాలా తక్కువగా ఉంటుంది. అయితే ఎక్కువ మంది కల్లు సేవించేవారు ఉన్నారు. ప్రభుత్వం కూడా అధికారికంగా లైసెన్స్‌లు ఇవ్వడంతో కల్లు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కల్లు కాంపౌండ్లు ఏర్పాటుచేసి కల్లును వినియోగదారులకు విక్రయిస్తుంటారు. ఈ కాంపౌండ్‌లోనే కుర్చీలు, టేబుళ్ల ఏర్పాటుచేయడంతో సాయంత్రం కాగానే పెద్ద సంఖ్యలో కార్మికులు, కూలీలు, ఆటో డ్రైవర్లతో పాటు ఇతర దినసరి కూలీ చేసి జీనవం సాగించే వారు అక్కడికి చేరి కల్లు సేవిస్తుంటారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అసలు తాటి చెట్టు లేకపోయినా కల్లును కావల్సిన మేర విక్రయిస్తున్నారు. మత్తు ఎక్కువగా ఉండటంతో ఒకసారి ఇక్కడకు వచ్చిన వారు దీనికి బానిసలైపోతారు. కల్తీ కల్లు తాగకపోతే మానసిక రోగులుగా మారడమే కాకుండా కొన్ని సందర్భాల్లో అపస్మారక స్థితికి చేరుకుంటారు. 1993లో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నాటుసారా, కల్లు విక్రయాలను నిషేధించారు. అంతకు ముందు ప్రభుత్వ సారాయి దుకాణాలు ఉండేవి. అనంతరం వాటిని పూర్తిగా మూసివేశారు. అయితే కల్లు నిషేధించడంతో గీత కార్మికుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. దీనితో ఆయన వెనక్కు తగ్గాల్సి వచ్చింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మారోసారి కల్లుల దుకాణాలు మూసివేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత కల్లు గీత కార్మికుల వినతి మేరకు తిరిగి కల్లు విక్రయాలకు అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలో తక్కువ రేటుకు కొన్ని బ్రాండ్ల మద్యం సీసాలు విక్రయించడంతో నాటు సారా దాదాపుగా కనుమరుగు అయ్యింది. అయితే కల్లు దుకాణాలు మాత్రం అందుకు భిన్నంగా పెద్ద సంఖ్యలో తెరిచారు. బెల్లంపల్లి, రంగారెడ్డి జిల్లా పెద్దముల్, మహబూబ్‌నగర్, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాలో పెద్ద సంఖ్యలో కల్తీ కల్లు తాగి పలువురు మృతి చెందారు. వందలాది మంది ఆసుపత్రి పాలయ్యారు. తాము తాగుతున్నది కల్తీ కల్లు అని తెలిసినా దానికి బానిసలుగా మారి తాగకుండా ఉండలేని పరిస్థితి నెలకొంది. పది లీటర్ల స్వచ్ఛమైన కల్లుకు 120 నుంచి 150 లీటర్ల నీళ్లు కలుపుతారు. రంగు కోసం కొన్ని రసా యనాలు కలుపుతారు. చిక్కగా కనిపించేందుకు, కల్లు రంగు రావడానికి సోడా యాష్, కుంకుడు రసం, సబ్బులో వాడే కొన్ని రసాయనా లను వాడుతారు. ఇది చాలదన్నట్లు మత్తు కోసం ఆల్ప్రోజోలం, డైజోఫాం, క్లోరో హైడ్రేడ్ వంటి నిషేధిత మత్తు రసాయనాలను పెద్ద మొత్తంలో కలుపుతారు. ఇది ఆరోగ్యానికి హానీకరంగా మారుతుంది. ముఖ్యంగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కంటిచూపు పూర్తిగా మందగించడం, మెదడుకు సంబంధించిన నరాలు దెబ్బతింటాయి. దీనితో శరీరం అదుపుతప్పుతుంది. జ్ఞాపకశక్తి కోల్పోతారు, మూత్రపిండాలు పనిచేయకుండా పోతాయి. జీర్ణకోశ వ్యాధులు వెంటాడుతాయి. దీనితో ఒక దశ తరువాత ఏ పని చేయలేని నిసత్తువ ఆవహిస్తుంది. నిర్లక్ష్యం చేస్తే కొన్ని రోజుల వ్యవధిలోనే ప్రాణాలు కోల్పో తారు. ప్రభుత్వం కల్లు కాంపౌండ్లకు లైసెన్స్‌లు ఇస్తోంది కాని వాటిపై పర్యవేక్షణ చేయడం లేదు. తాటి చెట్లు లేకుండా కల్లు ఎక్కడ నుంచి వస్తుందన్న అంశాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. పొట్టకూటి కోసం వృత్తిగా ఉన్న కల్లు సేకరణను కొనసాగిస్తున్న గీత కార్మికుల చేతి నుంచి ప్రస్తుతం కల్లు బడా వ్యాపారుల చేతికి వెళ్లిపోయింది. కేవలం డబ్బు సంపాదనపై మాత్రమే దృష్టిసారించే వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎక్కడైనా కల్లు సేవించి మరణించినా, పెద్ద సంఖ్యలో అనారోగ్యం బారిన పడినా అప్పటికప్పుడు ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది హడావిడి చేస్తున్నారు. కల్లు శాంపిల్స్‌ను తీసి లేబొరేటరీలకు పంపించి కల్తీ జరిగినట్లు తేలితే కల్లు కాంపౌండ్ నిర్వాహకులపై, కల్లు గీత కార్మికులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది కొరత నెపంతో శాంపిల్స్ తీసే ప్రక్రియ నామమాత్రంగా సాగుతోంది. కొన్ని రోజుల తరువాత కల్తీ కల్లు విక్రయాలు అదే ప్రాంతంలో కొనసాగుతున్నాయి. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం నీరాను తెరపైకి తీసుకువచ్చి నెక్లెస్ రోడ్డులో ఏకంగా దుకాణమే తెరిచింది. స్వయంగా ప్రభుత్వమే కల్లు ఆరోగ్యానికి మంచిదని ప్రకటించడంతో కల్లు సేవించే వారి సంఖ్య మరింతగా పెరిగింది. బీరు బాటిల్‌లో ఆల్కాహాల్ 4 నుంచి 6 శాతం ఉంటే కల్తీ కల్లులో వివిధ రసాయనాలు ఉపయోగించడం ద్వారా మత్తు కలిగించే ద్రవం 16 నుంచి 20 శాతం ఉంటుంది. ఇంత పెద్ద మొత్తంలో మత్తు ఉండటం, అది కూడా పూర్తిగా రసాయనాలతో కలిపి ఉండటంతో ఆరోగ్యం దెబ్బతింటోంది. తమిళనాడులో కల్తీ మద్యం సేవించి పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం జరగడంతో తెలుగు రాష్ట్రాల్లో కల్తీ కల్లు అంశం తెరపైకి వచ్చింది. అధికారులు దృష్టి సారించి ప్రాణాంతకమైన రసాయనాలు కలపకుండా చర్యలు తీసుకోవాలి. కల్లు గీత కార్మికు లను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ విధానాల ద్వారా ఉపాధి కల్పించి క్రమంగా కల్లు తీత ప్రక్రియను నిలిపివేయాలి. కొన్ని రాష్ట్రాల్లో తాటి చెట్ల నుంచి తాటిబెల్లం తీయడానికి వీలుగా గీత కార్మికులకు ఆర్థిక సహకారం, ప్రోత్సాహం కల్పిస్తున్నారు. ఇదే విధానాన్ని తెలుగు రాష్ట్రాల్లో కూడా అమలుచేయాల్సిన అవసరం ఉంది. గుడుంబాను ఏ విధంగా నిర్మూలించగలిగారో అదేవిధంగా కల్తీ కల్లు విక్రయాలను నిలిపివేయాల్సిన అవసరం ఉంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



# 'నీట్'కు సర్జరీ!

**జూన్..4వ తేదీ..మంగళవారం ఒక వంక లోక్‌సభ ఎన్నికల ఫలితాలు దేశంలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. సరిగ్గా అదే సమయంలో ఆరోజు సాయంత్రం 'నీట్' (యుజి) ఫలితాలు కూడా విడుదలయ్యాయి. కొందరిలో ఆనందం.. మరికొందరిలో విషాదం..ఆరెండు ఫలితాల నుంచి అలముకొన్నాయి.**

నిజానికి, నీట్ ఫలితాల వెల్లడికి ఇంకా పదిరోజుల సమయం ఉంది. 14, లేదా 15న ప్రకటిస్తామని ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ముందే ప్రకటించింది. కానీ ఎందుకో..లోక్‌సభ ఫలితాల రోజునే నీట్ ఫలితాలు కూడా వచ్చేశాయి. ఆ ఎన్నికల ఫలితాల మాటెలా ఉన్నా, నీట్ ఫలితాలు మాత్రం దేశంలో అనూహ్యమైన అలజడి సృష్టించాయి. పరీక్షలో జరిగిన అక్రమాలు విద్యార్థుల హృదయాల్లో మంటలు రేపాయి. ఆ పరీక్షను రద్దు చేయాలనే డిమాండ్ దేశంలోని విద్యార్థులందరి నుంచి ముక్తకంఠంతో వినిపించింది. తమ జీవితాలను విషాదంలో ముంచిన ఆ ఫలితాలు తమకు వద్దంటూ విద్యార్థిలోకం నినదించింది. విపక్షాలు కూడా రంగంలోకి దిగి అధికార నేతలను దుమ్మెత్తిపోశాయి. అన్ని రాష్ట్రాల్లో ఆందోళనలు ఉవ్వెత్తున ఎగయడంతో కేంద్రం కూడా ఎట్టకేలకు కదిలింది. విద్యార్థుల నుంచి పిటిషన్లు సుప్రీంకోర్టుకు చేరడంతో ఆ ఉన్నత న్యాయస్థానం వెంటనే స్పందించింది. నీట్ బంతి ఇప్పుడు సిబిఐ కోర్టులో పడింది. ఆ విచారణలో ఏం తేలుతుందో, విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతుందో? ఇప్పుడిదే మిలియన్ డాలర్ల ప్రశ్న.

కోచింగ్ సెంటర్లకు లక్షలు ధారపోసి సాధించిన జ్ఞానాన్ని పరీక్ష రోజున కుమ్మరించినా ఫలితం శూన్యమైతే ఆ విద్యార్థి భవిష్యత్తు ఏమవుతుంది? పరీక్షల్లో ఇన్ని అక్రమాలా? పరీక్ష పత్రాలు ఎందుకు లీక్ అవుతున్నాయి? ఒక్క ప్రశ్న పత్రం లక్షలు పెట్టి కొనుగోలు చేస్తున్నారంటే, వారికి అమ్ముతున్నారంటే దానివెనుక పని చేస్తున్నదెవరు? ఎవరు ఎవరితో కుమ్మక్కవుతున్నారు? ఓ పదిమంది విద్యార్థుల కోసం లక్షలమంది విద్యార్థుల జీవితాలను బలిచేయడం ఎంత దారుణం? ఈ దారుణానికి పాల్పడుతున్న వారివెనుక పని చేస్తున్న అదృశ్య శక్తులేమిటి? ఇప్పుడు దేశమంతా విద్యార్థుల నుంచి, వారి తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్న ప్రశ్నలివే. ఈ ప్రశ్నలన్నింటికి ఏవో కొన్ని సమాధానాలు దొరుకుతాయి. కానీ తర్వాత తీసుకొంటున్న చర్యలేమిటి? కంటితుడుపు సమాధానాలు, తాత్కాలిక చర్యలతో ప్రయోజనం ఉంటుందా? మళ్లీ అవేఅవే పునరావృత్తం కావడం లేదా? ప్రవేశపరీక్షలు ఎప్పుడు ఎక్కడ జరిగినా అవే అక్రమాలు బయట కొస్తున్నాయి. ఎందరో విద్యార్థులు తమ జీవితాలను ఈ పరీక్షలకు బలి చేస్తున్నారు. పరీక్షల్లో అక్రమాలను నివారించడానికే 2017లో ఎన్‌టిఎ అనే స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థను ఏర్పాటు చేశారు. జెఇఇ, నీట్, సియుఇటి, యుజిసి–నెట్ అనే నాలుగు పెద్ద పరీక్షలు ఎన్‌టిఎ ఆధ్వర్యంలో జరుగుతాయి. దేశంలో కొన్ని లక్షల విద్యార్థులు రాసే పరీక్షలు ఇవే. కానీ వాటిలోనే అక్రమాలు కూడా అధికంగా జరుగుతున్నాయి. ఏ ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్‌టిఎను ఏర్పాటు చేసిందో, అది నెరవేరలేపోగా

**కవర్ స్టోరీ**


**ఎ.వి.వి.ప్రసాద్**
**అసోసియేట్ ఎడిటర్**


విద్యార్థులు మరిన్ని సమస్యల్లోకి, సంక్షోభంలోకి కూరుకుపోతున్నారు.

**అసలేం జరిగింది?**

నీట్ ఫలితాల్లో ఎన్నడూ లేనివిధంగా ఈసారి 67మంది విద్యార్థులకు 720/720 మార్కులు వచ్చాయి. అంతమంది విద్యార్థులకు పూర్తి మార్కులు రావడమంటేనే 'ఏదో జరిగింది' అనే అనుమానాలకు తావిచ్చింది. కొన్ని దజన్లమందికి అన్ని మార్కులు ఏ సంవత్సరం రాలేదని గతంలోని గణాంకాలు చూస్తే అర్థమవుతుంది.

కానీ ఈ సంవత్సరం మే 5న నిర్వహించిన నీట్ పరీక్షల్లో మాత్రం ఇంత అత్యధికంగా విద్యార్థులు పూర్తిమార్కులు సాధించారు. ఓ రెండు మార్కులు తక్కువగా మరో వందమందికిపైగా సాధించారు. మిగిలిన ర్యాంకులు అంటే మూడు నాలుగు మార్కులు తక్కువగా వందలు, వేలమంది మార్కులు సాధించారు. అది చాలదన్నట్లు కొందరికి కలిపిన గ్రేస్ మార్కులు కూడా విద్యార్థులలో ఆగ్రహజ్వాలలు రగిలించాయి. 67మంది విద్యార్థులు 720 మార్కులు ఎలా పొందారని ఆరాతీయగా, అక్రమాల డొంక బీహార్‌లో ఉన్నట్లు తేలింది. ఆ డొంకను కదిపితే రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లోని డొంకలన్నీ కూడా కదిలాయి. ఇంకా మరికొన్ని రాష్ట్రాలలో కూడా పరీక్షపత్రాలు లీక్ చేసిన వీరులున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఒక్కొక్క పత్రాలన్ని వారు 30లక్షలకు కూడా అమ్మారనే విషయం తెలిసేసరికి అందరిలో ఆగ్రహం కట్టలు తెంచుకొంది.

ఆ ముఠాల వెనుక కొందరు రాజకీయ పెద్దల హస్తం ఉన్నట్లు కూడా తెలియడంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లి చివరకు 22వ తేదీన సిబిఐ దర్యాప్తునకు ఆదేశించడం జరిగింది. సుప్రీంకోర్టులో విద్యార్థుల పిటిషన్లపై విచారణలు జరుగుతున్నాయి. కౌన్సిలింగ్ ఆగదనీ, విచారణ సాగుతుందనీ సుప్రీంకోర్టు చెప్పింది.



దేశంలో ప్రభుత్వ, ప్రైవేటురంగంలోని వైద్యకళాశాలల్లో దాదాపు లక్షసీట్లు ఉండగా 24లక్షల మంది విద్యార్థులు ప్రవేశపరీక్ష రాశారు. ఎన్‌టిఎను ఏర్పాటు చేసి 'వన్‌నేషన్-వన్ టెస్ట్'ను ప్రయోగాత్మకంగా మొదలుపెట్టినప్పుడు తొలుత ఆశావహంగానే కనిపించినా, ఎక్కడలేనన్ని అక్రమాలు ఈ పరీక్షల్లోకి చేరడంతో ఇప్పుడు విద్యార్థులంతా దానిని ప్రశ్నించే పరిస్థితి తలెత్తింది. పరీక్ష జరగడానికి ఒకటిరెండు రోజుల ముందు కొన్ని పేపర్ లీక్ గ్యాంగ్‌లు 30-50లక్షల రూపాయలను ప్రశ్నపత్రాలను అమ్మకానికి పెట్టారంటే..అక్రమాలకు ఇది పరాకాష్టే కదా! 2023లో అంటే గత సంవత్సరం నిర్వహించిన పరీక్షలో ఇద్దరికి మాత్రమే 720 మార్కులు వచ్చాయి. 22లో ఒక్కరికి, 21లో ముగ్గురికి, 20,19లో ఒక్కొక్కరికి చొప్పున 720 మార్కులు వచ్చాయి. నిజంగా కష్టపడిన వారికే అలా






వచ్చాయని తేలికగానే అర్థమవుతుంది. కానీ ఈ సంవత్సరం అసాధారణంగా 67మందికి 720 మార్కులు వచ్చాయి. హర్యానాలోని ఒకే సెంటర్‌లో పరీక్షలు రాసిన ఆరుగురికి 720/720 వచ్చాయంటే అది ఎంత విడ్డూరం! సరైన జవాబుకు 4 మార్కులు కలిపితే, తప్పు జవాబుకు ఒక మార్కు తీసివేస్తారు. ఆ ప్రకారం ఎక్కువమంది విద్యార్థులకు 715 మార్కుల దాకా వస్తాయి. ఒకరిద్దరికి 720 వస్తే రావచ్చు. అప్పుడు పరీక్షా విధానం సక్రమంగానే ఉన్నట్లు లెక్క. కానీ కొందరు విద్యార్థులకు 718,719 కూడా వచ్చాయి. ఆ విధంగా రావడం అసాధ్యమనీ, వచ్చాయంటే అక్రమాలు జరిగాయని స్పష్టమవుతున్నదనీ నిపుణులు అంటున్నారు.

విద్యార్థుల నుంచి వచ్చిన పిటిషన్లపై జూన్ 11న సుప్రీంకోర్టు స్పందిస్తూ కేంద్రానికి, ఎన్‌టిఎకు నోటీసులు జారీ చేసింది. పరీక్షలు విశ్వసనీయత కోల్పోయే విధంగా ఎన్‌టిఏ ఎలా వ్యవహరిస్తున్నదంటూ ప్రశ్నించింది. ఆ తర్వాత కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ మీడియాతో మాట్లాడుతూ దీనిలో ప్రభుత్వం తప్పులేదనీ, ఏ రాష్ట్రంలో ఎలాంటి తప్పులు జరిగాయో విచారణ జరుపుతామనీ అన్నారు. కానీ తర్వాత మరో పదిరోజులు కూడా గడిచిపోయాయి. జులై 6 నుంచి జరగవలసిన కౌన్సెలింగ్‌ను వాయిదా వేయలేమనీ, అయితే విచారణ కొనసాగిస్తామనీ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జులై 8 నుంచి ఈ విచారణ తిరిగి కొనసాగుతాయి.

లీకేజి కేసుపై పోలీసులు ఇంతవరకు జరిపిన విచారణలో చాలా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవకతవకలకు మూలాలు తొలుత బీహార్‌లోను, తర్వాత గుజరాత్‌లోను ఉన్నట్లు తెలియడంతో ఆ రెండు రాష్ట్రాల్లో దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. బీహార్‌లో 30 నుంచి 36లక్షలకు ప్రశ్నపత్రాలను విక్రయించిన ముఠా ఆ విద్యార్థులను రహస్య ప్రదేశాలకు తరలించి ప్రశ్నలకు సమాధానాలు బట్టీ పట్టించినట్లు కూడా విచారణలో వెల్లడైంది. దీనినిబట్టి అంత పకడ్బందిగా వారు ప్లాన్ చేశారని అర్థమవుతుంది. బీహార్, గుజరాత్‌లో ఇప్పటిదాకా 17 మందిని అరెస్టు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. తమ వెనుక ఎవరెవరు ఉన్నారో, రాజకీయ పెద్దలెవరో వారు



బహిర్గతం చేస్తున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. మొత్తం వివరాలు పోలీసులు కోర్టు విచారణకు తెలియచేశాక ఆ పేర్లేమిటో అందరికీ తెలుస్తాయి. బీహార్ ప్రభుత్వ జూనియర్ ఇంజినీర్ సికిందర్‌కుమార్, కొన్ని కన్సల్టెన్సీ సంస్థలు నిర్వహిస్తున్న నితీశ్, అమిత్‌ఆనంద్, ఇంకా మరికొందరిని పోలీసులు అరెస్టు చేసి వాస్తవాలు రాబడుతున్నారు.

## యుజిసి నెట్ పేపరూ లీక్

ఒక వంక నీట్‌రగడ సాగుతుండగానే ఎన్‌టిఎ నిర్వహించినదే 'యుజిసినెట్' పరీక్షరగడ మొదలయింది. జూన్ 18న ఆ పరీక్షను ఎన్‌టిఎ నిర్వహించిన మర్నాడే కేంద్రం రద్దు చేసింది. ఆ పరీక్షలో అక్రమాలు జరిగాయని కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో పని చేసే భారతీయ సైబర్ నేర విచారణ సమన్వయ కేంద్రానికి చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం యుజిసికి వెంటనే ఇచ్చిన నివేదికను దృష్టిలో ఉంచుకొని కేంద్రం తక్షణ చర్య తీసుకుంది.




నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు బీహార్‌లో ఎక్కువగా వున్నట్లు వెల్లడవడంతో దానిపై నివేదిక ఇవ్వవలసిందిగా కేంద్రం బీహార్ ఆర్థిక నేరాల దర్యాప్తు విభాగాన్ని కూడా ఆదేశించింది. ఇలా నీట్ పరీక్ష అక్రమాలు బయట పడడం, యుజిసి నెట్ పరీక్ష ఏకంగా రద్దు అవడంతో దేశంలోని విద్యార్థులందరిలో అలజడి మరింత అధికమైంది. నెట్ పరీక్షల అక్రమాలను సిబిఐ




దర్యాప్తునకు తక్షణమే ఆదేశించగా, నీట్ పరీక్షలను సిబిఐ దర్యాప్తు 23వ తేదీ నుంచి ఆరంభమయింది.

## నష్టనివారణ చర్యలు

నీట్ పరీక్షను రద్దు చేయాలనే డిమాండ్ దేశమంతా వినిపించడంతో, తొలుత కొన్ని నష్ట నివారణ చర్యలకు కేంద్రం ఉపక్రమించింది. నీట్, నెట్ పరీక్షలను నిర్వహించే ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌సింగ్‌పై 22న కేంద్ర ప్రభుత్వం వేటు వేసింది. ఇండియా ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్, ఎండి అయిన ప్రదీప్‌సింగ్ ఖరోలాకు ఎన్‌టిఎ డిజిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అంతేగాక వైద్యవిద్యలో పిజి కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే నీట్-పిజి పరీక్షను కేంద్ర ఆరోగ్యశాఖ 22వ తేదీన ఆఖరి నిమిషంలో వాయిదా వేసింది. విద్యార్థుల ప్రయోజనాల కోసమే తాము ఈ చర్య తీసుకున్నట్లు ఎన్‌టిఎ తెలిపింది. ఇలా ఒకదాని మీద ఒకటి విద్యార్థుల తలను బొప్పి కట్టిస్తూనే ఉన్నాయి.

నీట్ వివాదం నేపథ్యంలో, పరీక్షలు పారదర్శకంగా, న్యాయంగా నిర్వహించడానికి వీలుగా ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నాయకత్వంలో పరీక్షల సంస్కరణలపై ఓ కమిటీని కూడా నియమించింది. ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఇది. పరీక్షల నిర్వహణ ప్రక్రియ, డేటా భద్రతకు చర్యలు, ఎన్‌టిఎ పునర్నిర్మాణం, పనితీరుకు సంబంధించిన సంస్కరణలను ఈ కమిటీ సిఫారసు చేస్తుంది. రెండు నెలల్లో ఈ కమిటీ తమ నివేదికను విద్యాశాఖకు సమర్పిస్తుంది. కె.రాధాకృష్ణన్ వంటి నిపుణుడి నాయకత్వంలో ఏర్పడిన కమిటీ గనుక ఆశాజనకమైన సిఫారసులనే చేస్తారని అనుకోవచ్చు. వివిధ ఐఐటిలకు చెందిన పలువురు నిపుణులు కూడా కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

పేపర్ లీక్‌లు పూర్తిగా నివారించడానికి వీలుగా కేంద్రం మరో చర్య కూడా జూన్ మూడో వారంలో తీసుకొంది. అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనడానికి 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్ 2024ను అమల్లోకి తెచ్చింది. ఇది జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లు చెబుతూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది నిజానికి ఎప్పుడో అమలు కావలసి ఉంది. రెండేళ్ల క్రితమే దీని అమలుకు ఆలోచన చేసినా, ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొనకపోవడంతో ఆలస్యమైంది. కొన్ని ఒత్తిళ్లతో గత ఫిబ్రవరిలో చట్టం చేసినా నోటిఫికేషన్ విడుదలలో కూడా మళ్లీ జాప్యం జరిగింది. దీని ప్రకారం చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా, పరీక్ష రాసేవారికి అనుచితంగా సాయం చేసినా, కంప్యూటర్ నెట్‌వర్క్‌ను ట్యాంపరింగ్ చేసినా, నకిలీ ప్రవేశ పరీక్ష కార్డులు

జారీ చేసినా నేరంగా పరిగణించి 5-10 యేళ్ల జైలుశిక్ష, కోటి రూపాయలదాకా జరిమానా విధిస్తారు. నేరం రుజువైతే నేరస్థుల భాగస్వాముల ఆస్తులను కూడా జప్తు చేస్తారు. ఇకనుంచి పేపర్ లీక్ కేసులన్నీ ఈ చట్టం కిందే నమోదు చేస్తారు. చట్టంలో నిబంధనలైతే కఠినంగానే ఉన్నాయిగానీ ఆ చట్టం పరిధిలోకి వచ్చేది ఎందరు? పట్టుబడేది ఎవరు? అన్నది ప్రశ్నార్థకమే. సుప్రీంకోర్టులో నీట్ కేసులపై తదుపరి విచారణ జులై 8న జరుగనున్నందున, 6వ తేదీన కౌన్సిలింగ్ ప్రారంభించడమేమిటని చాలామంది ప్రశ్నిస్తున్నారు. సుప్రీంతీర్పు తర్వాత కౌన్సెలింగ్ జరిపితే విద్యార్థులో టెన్షన్ ఉండదని వారు అంటున్నారు. అయితే సుప్రీంకోర్టు ఆ అభిప్రాయాన్ని తిరస్కరిస్తూ కౌన్సెలింగ్ అనేది 'ఓపెన్ అండ్ షట్' ప్రక్రియ కాదనీ, అందువల్ల కౌన్సెలింగ్ యధాతథంగా జరుగుతుందనీ తెలియజేసింది. సిబిఐ దర్యాప్తులో ఏం తేలుతుందో, సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు చెబుతుందో? అన్నది విద్యార్థులకు ప్రశ్నార్థకంగా మారింది.

## సమాధానం లేని గ్రేస్ మార్కుల వివాదం

పరీక్ష సమయంలో పాలనాపరమైన లోపాల వల్ల విద్యార్థుల సమయం కొంత వృధా అవడంతో 1563 మందికి గ్రేస్ మార్కులు ఇస్తున్నట్లుగా ఎన్టిఏ ప్రకటించింది. ఇది మళ్లీ తీవ్ర వివాదంగా మారింది. అలా ఇవ్వడం వల్ల ర్యాంకులు తారుమారై, కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం వస్తుందనీ, అందువల్ల ఆ మార్కులు రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ దానిపై కూడా సుప్రీంలో పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే వాటిపై కూడా సుప్రీంకోర్టు ఎన్టిఏ నుంచి వివరణ కోరింది. ఆ వివరణకు సంతృప్తి చెందని సుప్రీం గ్రేస్ మార్కుల విధానం రద్దు చేయవలసిందిగా సూచించింది. ఎన్టిఏ దానిపై




ఆ 1563 మందికి తిరిగి టెస్ట్ పెడతామని చెప్పి జూన్ 23న మళ్లీ పరీక్ష నిర్వహించింది. అయితే ఆ గ్రేస్ మార్కులు



పుచ్చుకొన్నవారిలో సగం మంది కూడా పరీక్షకు హాజరు కాకపోవడం కొసమెరుపు. మూడు వారాలుగా జరిగిన పరిణామాలలో బీహార్‌లో పేపర్‌లీక్, పలుచోట్ల విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడం, ఉపాధ్యాయులు నిర్వహించే ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, మరో నాలుగు రాష్ట్రాల్లో కూడా పేపర్ లీకేజీకి బాధ్యులను గుర్తించడం, ప్రశ్నాపత్రాల రవాణాలో అవకతవకలు, ఇంకా సంబంధిత అంశాలపై దర్యాప్తు జరుపుతున్న సిబిఐ సుప్రీం ఆదేశాల మేరకు త్వరగానే నివేదిక సమర్పించి సిఫారసులు చేయగలదనే అనుకోవాలి. ఆ వెంటనే సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుపైనే లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. ఎన్టిఏ అధిపతిపై చర్య తీసుకొన్నారు, సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది.. అంతవరకు బాగానే ఉంది. సిబిఐ సర్జరీ అయితే మొదలు పెట్టింది. ఇప్పుడు బయట పడిన వ్రణాన్ని తొలగించి కుట్లు వేయగలరు. కానీ మరో వ్రణం పెరగదనే గ్యారంటీ ఎవరిస్తారు? విద్యార్థులు ప్రతి సంవత్సరం ఇలాంటి సంక్షోభాల్లో కూరుకుపోవలసిందేనా? 'వన్ నేషన్, వన్ టెస్ట్' ఎంత 'సత్ఫలితాలు' ఇస్తున్నదో చూస్తున్నాం. నిజంగా సత్ఫలితాలు ఇచ్చే విధానం కేంద్రం అనుసరిస్తేనే ఈ దేశ యువతకు భవిత కనిపిస్తుందేమో! ■

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

# వైద్యుల సేవలు..



**అంతర్జాతీయ** వైద్యదినోత్సవం ప్రతి సంవత్సరం జులై 1న నిర్వహిస్తున్నారు. ఆరోజు వైద్యుల సేవలను గుర్తించేందుకు, వారి కృషిని స్మరించేందుకు, వారి పాత్రను సమాజంలో విశిష్టంగా గుర్తించేందుకు ఏర్పాటు చేయబడింది. వైద్యులు మన ఆరోగ్య రక్షకులు, సంక్షోభ సమయాలలో ఆదుకునేవారు. వారి నిరంతర కృషి, ధైర్యం, అంకితభావం మానవ జీవితాలను సమర్ధవంతంగా నిలబెట్టడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

**వైద్యుల సేవలు:** వైద్యులు సమాజంలో అత్యంత గౌరవనీయులైన వ్యక్తులు. వారి జీవితాలను రక్షించడం మాత్రమే కాకుండా, రోగుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సునూ కాపాడతారు. వారికి ఉన్న గణనీయమైన బాధ్యతలు అనేకం.

**రోగ నిర్ధారణ, చికిత్స:** వైద్యులు రోగులను పరీక్షించి, వ్యాధిని నిర్ధారించి, సరైన చికిత్సా విధానాన్ని అవలంభిస్తారు. వారు మానవ శరీరంలో జరిగే ప్రతీ మార్పును గమనించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా రోగులను కాపాడతారు.

**సేవా నిబద్ధత:** వైద్యులు తమ వృత్తిలో ఉన్నత ప్రమాణాలతో సేవలు అందిస్తారు. రాత్రి, పగలు లేకుండా వారు సేవలలో ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో వారు వెంటనే స్పందించడం, రోగులను కాపాడటం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తారు. ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వైద్యులు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, వ్యాధుల నివారణ మార్గాలను సూచిస్తారు. ఆరోగ్యవంతమైన జీవనశైలిని అనుసరించేందుకు ప్రజలను ప్రోత్సహిస్తారు.

**విజ్ఞానవృద్ధి:** వైద్యులు తమ వైద్యవిద్యను నిరంతరం కొనసాగిస్తూ, కొత్తకొత్త రోగనిర్ధారణ విధానాలు, చికిత్సా పద్ధతులు నేర్చుకుంటారు. తాజా పరిశోధనలు, విజ్ఞాన సాంకేతికతలపై అవగాహన పెంచుకుంటూ ఉంటారు.

**వైద్యుల సవాళ్లు:** వైద్యవృత్తి అత్యంత గౌరవనీయమైనది అయినప్పటికీ, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుంది. అంతేకాదు వైద్యులు నిరంతరం పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. వైద్యులు తగినంత విశ్రాంతి సమయం లేకుండా పనిచేయడం వల్ల, రోగులపై సంపూర్ణ శ్రద్ధ పెట్టడం కష్టమవుతుంది.

**వైద్యపరికరాలు, ఔషధాల కొరత:** అనేక ప్రాంతాల్లో ఆధునిక వైద్యపరికరాలు, ఔషధాలు తక్కువగా అందుబాటులో ఉంటాయి. ఇది వైద్యులకు చికిత్స చేయడంలో ఇబ్బందులు కలిగిస్తుంది. అంతేకాదు నిరంతరం వ్యాధుల రూపాలు మారుతూ ఉంటాయి. ఈ మార్పులను అనుసరించి చికిత్సా విధానాలు, ఔషధాలు అభివృద్ధి చేయడం పెద్ద సవాలు. వైద్యులు సముచిత ఆర్థికపరమైన సాయం లేకుండా తమ సేవలను అందిస్తారు. ప్రభుత్వాలు, సంస్థలు ఈ విషయాన్ని గుర్తించి వైద్యులకు తగిన సాయం అందించాలి. భవిష్యత్తులో వైద్యుల పాత్ర మరింత విస్తృతం కానుంది. ఆధునిక సాంకేతికత, నూతన వైద్యవిధానాలు, వైద్యవృత్తిని ప్రభావితం చేయనున్నాయి.

**టెలీమెడిసిన్:**
భవిష్యత్తులో టెలీమెడిసిన్ విస్తృతంగా ఉపయోగపడే అవకాశం ఉంది. ఇది రోగులకు సులభంగా వైద్యసేవలు అందించే మార్గంగా అభివృద్ధి చెందుతుంది. రిమోట్ కంట్రోల్ ద్వారా వైద్యులు రోగులను పరీక్షించి, చికిత్సా విధానాలు సూచించగలరు.

**కృత్రిమ మేధ:** కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా రోగనిర్ధారణ, చికిత్సా విధానాలు మరింత సులభంగా కానున్నాయి. ఏఐ ఆధారిత డయగ్నస్టిక్ టూల్స్, రోబో సర్జన్లు వైద్యులకు సహాయం విరివిగా చేస్తాయి.

జన్యుశాస్త్రం ఆధారంగా ప్రత్యేకీకరించిన చికిత్సలు అభివృద్ధి చెందుతాయి. ప్రతి వ్యక్తి జన్యువులను అనుసరించి వారికి సరైన చికిత్సలు అందించడం భవిష్యత్తులో సాధ్యం కానుంది. నూతన ఔషధాలు,అ నూతన ఔషధాల అభివృద్ధి, వ్యాధుల చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి. ప్రజలకు ఆరోగ్యంపై మరింత అవగాహన పెంపొందించడంతో ముందస్తుగా వ్యాధులను నివారించడం సాధ్యమవుతుంది. వైద్యులు ఈ విషయంపై మరింత శ్రద్ధ పెట్టడం ద్వారా, సమాజాన్ని ఆరోగ్యవంతంగా నిలుపుతారు. అంతర్జాతీయ వైద్యదినోత్సవం వైద్యుల సేవలను గుర్తించేందుకు, వారి కృషిని స్మరించేందుకు, వారి పాత్రను సమాజంలో విశిష్టంగా గుర్తించేందుకు ఒక సందర్భం. వైద్యులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ, నిరంతర కృషి, ధైర్యం, అంకితభావంతో ఆరోగ్య రక్షకులుగా నిలుస్తారు. భవిష్యత్తులో వైద్యులు ఆధునిక సాంకేతికతను, నూతన వైద్యవిధానాలను అనుసరించి మరింత అభివృద్ధి చెందుతారు. వారి సేవలు సమాజంలో మరింత ముఖ్యంగా మారతాయి. అటువంటి వైద్యుల సేవలను గుర్తించి, వారికి తగిన గౌరవం ఇవ్వడం మన సమాజంలో అందరి బాధ్యత.

**– డాక్టర్ చిట్యాల రవీందర్**

ఓ స్టార్టప్ ప్రయాణంలో..ఆలోచన అన్నది విత్తనం మాత్రమే. అది మొలకెత్తాలంటే అడుగడుగునా దారిచూపే మెంటార్ కావాలి. అంతకన్నా మనం పనిచేయడానికి ఓ ఆఫీస్ కావాలి, దానికి అద్దె, కరెంటు బిల్లూ కట్టేంతగానైనా పెట్టుబడి ఉండాలి. బయట ప్రాంతమైతే మనం నిలదొక్కుకునే దాకా బస, భోజనం అవసరాలూ తీర్చేవాళ్లుండాలి. పల్లెటూళ్ల నుంచి వచ్చే యువతకి ఇవన్నీ ఉచితంగా అందిస్తోంది 'ఆలమరమ్' అన్న ఇన్‌క్యుబేషన్ సంస్థ.



# అంతా ఉచితమిక్కడ

మిగతావాటిల్లా లాభాల్లో వాటా అడక్కుండా కేవలం సేవాదృక్పథంతో వీటిని సమకూరుస్తోంది.

ఆ అమ్మాయి పేరు మోహన దీప. తమిళనాడు తూత్తుకుడిలోని ఓ కుగ్రామం తనది. చిన్నప్పటి నుంచీ బొమ్మలు గీయడంలో ఆసక్తి ఉండటంవల్ల విజువల్ కమ్యూనికేషన్స్‌లో బీఎస్సీ చేసింది. 'ఇక చదివింది చాలు..పెళ్లి చేసేస్తాం' అని పెద్దవాళ్లంటే పట్టుబట్టిమరీ ఉద్యోగంలో చేరింది. అక్కడ గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తున్నప్పుడే వెబ్ గ్రాఫిక్ డిజైనింగ్‌లకి సంబంధించి తానూ ఓ స్టార్టప్ పెట్టాలన్న ఆలోచన వచ్చింది దీపకి. ఉద్యోగానికే వెళ్లొద్దన్న వాళ్లు కంపెనీ పెడతామంటే ఊరుకుంటారా..'మన కుటుంబంలో ఏడు తరాలు వెదికి చూసినా ఎవరూ వ్యాపారం చేయలేదు.. వద్దేవద్దు. అంటూ వెనక్కిలాగారు. తను తగ్గలేదు. అప్పుడే దీపని 'ఆలమరమ్' ఇన్‌క్యుబేషన్ సెంటర్ ఆదుకుంది. తన ఆలోచనల్ని ఆచరణలో పెట్టడానికి ఆఫీసుని ఇచ్చింది. మెంటార్‌నీ ఏర్పాటు చేసింది. ఆ సాయంతో గత ఏడాది 'హనటోరియం' అనే అంకురసంస్థని స్థాపించింది దీప. ఏడాది తిరక్కుండానే వందకుపైగా కంపెనీలని వినియోగదారులుగా మార్చుకుని నలుగురికి ఉద్యోగం ఇచ్చే స్థాయికొచ్చింది.

అరుణ్‌కుమార్ తండ్రి వ్యాను డ్రైవర్. ఎంతో కష్టపడి అరుణ్‌ని ఇంజినీరింగ్ చదివించాడు. కోడింగ్‌లో పట్టు సాధించిన అరుణ్ ఐదేళ్ల ఉద్యోగం చేశాక తన స్నేహితులు ముగ్గురితో కలిసి 'షెల్‌కోడ్' అన్న సంస్థని ప్రారంభించాడు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతల సాయంతో ఈ-కామర్స్ సంస్థల సామర్థ్యాన్ని పెంచడమే దీని లక్ష్యం. కానీ- ఈ కొత్తవాళ్లని నమ్మి ఆ పెద్ద సంస్థలు ఎలా పని ఇస్తాయి. ఇక్కడే వాళ్లకి అండగా నిలిచింది అరమరమ్. వెబ్‌సైట్ ఏర్పాటుకే కాదు వినియోగదారులతో మంతనాలకీ వేదికగా మారింది. ప్రస్తుతం జెప్టో, క్రెడిట్ బీ, డ్రీమ్11 వంటి పెద్ద కంపెనీలకి సేవలందిస్తోంది షెల్‌కోడ్. వందమంది ఉద్యోగులతో ఏటా 20కోట్ల రాబడి చూస్తోంది. ఈ రెండే కాదు..ఇటువంటి 20 స్టార్టప్ ఆలోచనలకి రూపాన్నిచ్చింది 'ఆలమరమ్' సంస్థ. ఈ స్టార్టప్‌ల వ్యవస్థాపకులందరూ గ్రామీణ ప్రాంతాలవాళ్లు, తొలితరం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు. వాళ్ల కోసమే ఈ సంస్థని ఏ లాభాపేక్షా లేకుండా ప్రారంభించాడు అంబిమూర్తి. ప్రభుత్వాలు పెట్టినవి కావొచ్చు, విద్యా సంస్థల్లో ఏర్పాటైనవి కావొచ్చు, ఇన్‌క్యుబేషన్ సెంటర్ ఏదైనా సరే..ప్రతి స్టార్టప్ నుంచీ కనీసం ఏడుశాతం వాటా ఆశిస్తుంది. అవేవీ లేకుండా మంచి ఆలోచన ఉండి, కనీసం పదేళ్లపాటు స్టార్టప్‌ని నడపగలరన్న నమ్మకం తనకు కలిగిస్తే చాలు అంకుర సంస్థలకి అండగా నిలుస్తున్నాడు అంబిమూర్తి. ఆలమరమ్ అంటే మర్రిచెట్టు అని అర్థం. పేరుకు తగ్గట్టే ఎన్నో అంకుర పక్షులకి ఆశ్రయాన్ని కల్పిస్తున్న ఈ సంస్థ నేపథ్యం ఇది..

**తండ్రి స్ఫూర్తితో**

అంబిమూర్తి తండ్రి త్రిమూర్తి తమిళనాడు ఖాదీ సంస్థలో పనిచేస్తుండేవాడు. మామూలు ప్రభుత్వ ఉద్యోగే అయినా ఎంతోమంది పేద పిల్లల్ని సొంత ఖర్చుతో చదివించాడు. ప్రతివారం అన్నదానాలు చేసేవాడు. ఇవన్నీ అంబిమూర్తిని ఎంతో ప్రభావితం చేశాయి. ఐఐటీలో ఇంజనీరింగ్ చేసిన అతను కాలిఫోర్నియాలోని ఓ ఐటీ సంస్థలో పనిచేశాడు. తర్వాత భారతదేశానికి వచ్చి శ్రీధర్ వేంబుకి చెందిన 'జోహో'లో చేరాడు. చిన్నగ్రామాలూ, పట్టణాల్లోనూ పెద్ద కంపెనీలూ పెట్టొచ్చన్న స్ఫూర్తిని సొంతం చేసుకున్నాడు. జోహో తరపున ఇంగ్లండు, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్‌ల్లో పనిచేస్తున్నప్పుడు అక్కడి స్టార్టప్ వాతావరణాన్ని దగ్గరగా చూశాడు. ఆ అనుభవాలతో తన మిత్రుడితో కలిసి గో-జెన్ అనే సంస్థని కోయంబత్తూరులో ఏర్పాటు చేశాడు. ఆ చిన్న నగరంలో తొలితరం పారిశ్రామికవేత్తగా నిలదొక్కుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. అయినా పట్టుదలతో శ్రమించి దేశవిదేశాల్లో వందలమంది వినియోగదారుల్ని సొంతం చేసుకున్నాడు. ఆ సంస్థ మెల్లగా లాభాలబాట పడుతుండగానే అంబిమూర్తి తండ్రి త్రిమూర్తి అనారోగ్యంతో కన్నుమూశాడు. ఆయన స్మృతీ, సేవాస్ఫూర్తి కలకాలం నిలవాలన్న ఆలోచనతో 'ఆలమరమ్' సంస్థని స్థాపించిన అంబిమూర్తి ఏంజల్ ఇన్వెస్టర్లలు 70శాతం వాటాలు అడుగుతుంటే బెదిరిపోయి బిత్తరచూపులు చూస్తున్న యువతని అక్కున చేరుకున్నాడు. వాళ్లని పారిశ్రామికవేత్తలుగా మలుస్తున్నాడు.



# నవ్వుల నజరానా

ఏవో
తేలికపాటి నవ్వుల జల్లులు
పడతాయనీ
తడిసి ముద్దవుదామని/ నవ్వుల వనంలోకి అడుగిడాను
ఏదో యోగాభ్యాసమట/ మదిలో లేనిదైనా
పైకి పగలబడి నవ్వేవారిని చూసి
ఓహో! ఇది ఆరోగ్యదాయకమేనా!
అనుకుని సాగిపోయాను
అతనెవరో ఓడిపోయి గెలిచాడట
ఎందరు గేలి చేసినా/ ఏడ్వలేక నవ్వుతున్నాడు
ఆ ముఖాన్ని ఇక చూడలేక/ అక్కడ నుండి కదిలాను
అంతలోనే వికటాట్టహాసం గావిస్తూ
అది చేస్తామిదిచేస్తామని నాయకులు
విరగబడి విషపు నవ్వులు విసురుతుంటే
అమ్మో! ఇక చాలంటూ/ నవ్వుల వనాన్ని దాటాను
అంతలో ఆకలిగొన్న ఆసామికి
ఎంతో కొంత ఆహారం దొరికినప్పటి
మందహాస ముఖాన్ని చూడగానే
అనుకోకుండా నా పెదవిపై
ఆనందపు చిరునవ్వు వాలింది
ఇంటికెళ్లగానే చూసాను
ఊయలలో పరుండిన పసిపాప దరహాసాన్ని
ఇంతకన్నా నవ్వుల నజరానా
మరెక్కడా దొరకదని అనిపించింది.

**– పొత్తూరి సుబ్బారావు**

# జీవన పోరాటం

కలలు విరిగిన చోట
కన్నీళ్లు పలకరిస్తుంటాయ్.
బీడువారిన పొలంవంక చూసాను
ఆశలు విరిగినట్టయింది.
కళ్లు ఎర్రగించిన ఆకాశం వంక
చూసాను.
గుండె మండిపోతోంది.
దగాపడ్డ రైతువంక చూసాను
నడ్డి విరిగినట్టయింది.
దీనంగా చూసే
నిరుద్యోగి వంక చూసాను
రేపటి భవిష్యత్తుపై
బిక్కుబిక్కుమంటున్నాడు.
కూలీలు పనికోసం
ఊళ్లని వదిలిపోతున్నారు.
పల్లె కన్నీళ్లతో
నిస్సహాయంగా ఏడుస్తోంది.
ప్రపంచం అంతా
బతుకంటేనే పోరాటం.



విరిగిన కలల్ని
మెట్లుగా
నిర్మాణం చేసి
ముందుకి
కదలటమే కదా
బతుకుకి
సాకారం.
మనకి మనమే
ఉపాధి ద్వారాలు తెరవడమే కదా
అసలైన ప్రగతిపథం!

**– గవిడి శ్రీనివాస్**

# నాకు ఒక కల ఉంది..

మనిషిని నిలబడనివ్వని చోట
నీడలకు స్వేచ్ఛాపాఠం చెప్పున్న సమాజం
స్పష్టంగా దహనమయ్యేటి/ ఒకరోజు వస్తుంది.
దేహం రంగు, భాష, వృత్తి
బానిసత్వ వివక్షతలకు చిహ్నాలనుకుంటున్న
ఈ కుటిల మానవత్వం కూలిపోయే
ఒక సందర్భం వస్తుంది.
ఎత్తిన పిడికిళ్ల కుత్కెలను పిసికి
విర్రవీగుతున్న అహంకార
ఆధిపత్యపు
మెదళ్లను కాల్చేసే అక్షరాలు
వారి గుండెల్లో నల్లటి పాటలవుతూ
వెంటాడే క్షణం ఒకటొస్తుంది.
నువ్వు, నేను అనే/ అంతర బహిర మరకలు
దూరమవుతూ
మనం మనందరమయ్యేటి/ ఒక దేశం పురుడోసుకొని
ప్రపంచ పటంపై స్వేచ్ఛగీతం
సంతకమయ్యే సందర్భం ఒకటొస్తుంది.
కలలు కలగానే కాదు/ వాటి విజయం
గుండెల నిండా పొంగే
సందర్భం కూడా వస్తుంది.

**– రామ్ పెరుమాండ్ల**

ఈవారం కవిత్వం



## పుస్తక సమీక్ష


## సుబ్బారాయుడు-బాల కథామాలిక



ప్రతాప వెంకట సుబ్బారాయుడు ఏర్చికూర్చిన బాల కథామాలిక 'గోడలకు చెవులుంటాయి'లో 25 కథలు పిల్లల కోసం అనుకొన్నా, చదువరులను అందరినీ ఆకట్టుకొంటున్నాయి. ఈ సంక్షిప్త కథలు పిల్లల లేత మనస్సులకు సంబంధించిన స్నేహం, నిజాయితీ, పరోపకారం, మంచిపనులు చేయడం, మానవత, యుక్తి, సద్బుద్ధి వంటి మంచి లక్షణాలతో ఆసక్తికరంగా మనోవికాసాన్ని కలిగిస్తున్నాయి. 'అల్లరి కోతి అగచాట్లు' కథలో గజ్జెలు కట్టుకొన్న కోతి కథనం, 'గోడలకు చెవులుంటాయి'లో రహస్యాన్ని చెవిలో చెప్పడం, అర్థులులో చెంబు కథనం, వంశ గౌరవం కథలో మట్టిపాత్ర ఉత్తరం కథారచయిత కల్పనా ప్రతిభకు అద్దం పడుతున్నాయి. ప్రతీకథలోనూ, రచయిత ముగింపు, సందేశాత్మకంగా వుండటంతో పిల్లలకు కాలక్షేపం కోసం చదివినా మంచి ఆలోచనలు కలిగిస్తాయి. పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోతున్న ప్రస్తుతంలో బాలబాలికలకు పుస్తక పఠనంతోపాటుగా, ఆలోచింపచేసి జిజ్ఞాస కలిగించాలంటే కథలు రాయడం ప్రతాప వెంకట సుబ్బారాయుడు అలవోకగా సాధించగల ప్రజ్ఞగల కథా రచయితగా ఈ సంపుటి అభినందనీయంగా వుంది. ప్రతీకథకు చిత్రకళాకారుడు గోపాలకృష్ణ సమకూర్చిన చిత్రాలు కథా సంపుటికి నిండు చేకూర్చాయి. **(గోడలకు చెవులుంటాయి, రచన: ప్రతాప వెంకట సుబ్బారాయుడు, వెల: 200, ప్రతులకు: పి.వి.సుబ్బారాయుడు, బి-40, రోడ్ నెం: 4, జె.జె.నగర్, సైనిక్‌పురి, సికింద్రాబాదు)**

**- యర్రమిల్లి**

## అబ్బురపరచే చరిత్ర



తెలుగుదేశానికి, ఈజిప్టుకు మధ్యదూరం 5000 కి.మీ. క్రీస్తుపూర్వం 5000 సంవత్సరాలు. అంటే మెసపటోనియా నాగరికథ వర్ధిల్లిన సమయాన తెలుగువారి సంస్కృతి, నామధేయాలు ఈజిప్టులో పరిఢవిల్లాయి అంటే నమ్మశక్యం కాదు. అయినా, డా॥ఎస్.వేణుగోపాల్ సహేతుకంగా మనవారు ఆ దేశంలో స్థిరపడ్డారని అభిప్రాయపడుతున్నారు. నర్మదానది తీరం నుంచి నేటి శ్రీలంక దాటి తెలుగువారు ఈజిప్టు గ్రీకు దేశాల్లోకి వలసలు వెళ్లారంటారు రచయిత. ఈజిప్టు నేలిన మొదటిరాజు 'మెనెస్' అని రాజధాని మెమ్‌ఫిస్ అని అంటారు. మెమ్‌ఫిస్ అంటే మహాఅంపశయ్య అంటారు. నైలునది (నీలనది) ప్రాంతపు వారి సంస్కృతి 'బదరి' అని బదరి అంటే 'రేగువనం' అని రచయిత పేర్కొంటారు. తర్వాత కాలం రాజు భార్య 'నెఫ్రతి' అని. ఈ పదానికి తెలుగు అర్థం 'నవ+రతి' అంటారు. రామసెస్ 1, 2 ప్రభువులు క్రీ.పూ 12 శతాబ్దం నాటి తెలుగు వలసవారని రచయిత పేర్కొంటారు. క్రీ.పూ 4500 సంవత్సరాల ఈజిప్టును 'మతం' అని పిలిచేవారట. 'కమతం' పదం తెలుగుభాషకు చెందిన భూవివరాలు తెలిపే పదం అని మనకు తెలుసు. శాతవాహనుల కాలం నుండే దక్షిణాదివారు నాటి కాంభోజ (కాంబోడియా) నేటి థాయ్‌లాండ్, మలేసియా దేశాలకు వెళ్లి అక్కడి సంస్కృతిలో భాగమయ్యారని అందరం ఎరిగిన సత్యమే. మరికొంత ప్రామాణికత అవసరం. **(ఈజిప్టు ఆవిర్భావం, రచన: డా॥ఎస్.వేణుగోపాల్, వెల: రూ 75, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

**- కూర చిదంబరం**

## 'ఈ సూర్యుడు అస్తమించడు'

గంగుల జనార్ధనరెడ్డి, జయమ్మలకు అంకితంగా ఈ నవలాత్రయాన్ని ప్రచురించారు. యీ మూడు నవలలూ 1979-1982 మధ్యకాలంలో రాసినవే. 'ఈ సూర్యుడు అస్తమించడు' నవల యువమాసపత్రికలో 1979లో ప్రచురణైంది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గ్రామీణ నేపథ్యంలో రైతుల, కూలీల సమస్యలు ఆకలి బాధలు, కరవులు, వలసలు,



గురించి అందరికి అర్థమయ్యేలా రాసారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ద్వారా వాణిజ్యపంటలు వేయడం ద్వారా రైతాంగం సేద్యాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఈ నవల్లో చెప్పారు. 1980లోరాసిన 'మహాభాగ్యం' నవల కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గ్రామీణ నేపథ్యంలో రాయబడినదే. గ్రామాల్లో వైద్యసదుపాయాలు లేని స్థితి ఆరోగ్య సమస్యల గురించీ, పల్లెటూళ్లకు రాని డాక్టర్ల గురించి, చక్కగా రాస్తూనే గ్రామాల్లో వుండి ప్రజల్ని మోసగించే నకిలీ వైద్యులగురించి, నాటు వైద్యుల గురించి చెప్పారు ఈ నవల్లో. గ్రామీణ చైతన్యం సూచించే మంచి నవల ఇది. ఆనాటి సమాజంలో పేదప్రజల పట్ల ధనవంతుల దాష్టీకాల గురించి, పోలీసుల అమానవీయ ప్రవర్తన గురించీ, అమాయకులకు న్యాయం లభించని న్యాయ పరిస్థితుల గురించీ ఈ నవలలో రాసారు. ఈ నవల స్వాతిలో ప్రచురణై ప్రథమ బహుమతి పొందింది. **(ఈ సూర్యుడు అస్తమించడు, రచన: గంగుల నరసింహారెడ్డి, వెల: రూ 200, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

**- తంగిరాల చక్రవర్తి**

పాత్రికేయ కవి తంగెళ్ళపల్లి కనకాచారి 15 కథానికలతో తొలి ప్రయత్నంగా వెలువరించిన సంపుటి 'నీ స్నేహం కోసం'. పేరుకు తగ్గట్టుగానే స్నేహబంధంతో పెనవేసుకుని కథనం సాగుతుంది. కాలేజి విద్యార్థుల నేపథ్యంతో సింహ

## స్నేహమే ఆలంబనగా..కనకాచారి కథలు



భాగం కథల్ని తీర్చిదిద్దారు. ప్రతి కథలో యువతీ యువకుల మధ్య స్నేహ వాతావరణాన్ని సృష్టిస్తు, స్నేహమాధుర్యాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వచిస్తు కథాగమనాన్ని నిర్దేశించిన తీరు బాగుంది. యువతీయువకుల మధ్య వున్న పరిచయాలన్నీ స్నేహాలు కావు..స్నేహాలన్నీ ప్రేమలూ కావు. ప్రేమలన్నీ పెళ్లికి దారి తీయవు. విఫలమైన ప్రేమకు చావు పరిష్కారం కాదు. 'నీ నీడనై వస్తున్నా!' కథానిక చదవండి..మీరు ఒప్పుకుంటారు. 'ప్రేమించడం వల్లే ఎదుటివారి తప్పుల్ని మనం మన్నించగలం...మరింత మెరుగ్గా ఎలా వుండాలో నేర్పగలం' అని సందేశాన్నిచ్చిన కథానిక 'వెన్నెలస్వర్గం'. 'అనుబంధాలు' కథానిక 'ఈలోకం అద్దంలాంటిది..మనం ఏం చూస్తామో అదే కనబడ్తుంది. ఎవరిలోకం వారికి కనబడ్తుంది. అందుకే మార్పురాదు' అనే సత్యాన్ని ఎరుకపరుస్తుంది. కవిత్వమే కాదు..కథను రాయడంలోనూ సిద్ధహస్తుడు కనకాచారి. **(నీ స్నేహం కోసం, రచన: తంగెళ్ళపల్లి కనకాచారి, వెల: రూ 120, ప్రతులకు: ఇ.నెం. 8-648, సిపిఐ కాలనీ, బాలాజీ నగర్, కాప్రా, మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా)**

**- రమణ వెలమకన్ని**

# మనసులను రంజింపచేసే వాయిద్యాలు

ఐ.ప్రసాదరావు

హరిప్రసాద్ చౌరాసియా, పండిట్ రవిశంకర్, ఉస్తాద్ అబ్దుల్ అలీఖాన్, బిస్మిల్లాఖాన్, జాకీర్ హుస్సేన్, మన తెలుగు కిన్నెర వాయిద్యకారుడు మొగిలయ్య వంటివారు మదిలో మెదలగానే మనసు ఆనందంతో పులకరిస్తుంది. అటువంటి సంగీత కళాకారులు వివిధ వాయిద్యాల ద్వారా భారతీయులనే కాకుండా ప్రపంచసంగీత ప్రియులను అలరించారు. మనదేశంలో శాస్త్రీయ సంగీతం, జానపద సంగీతం శతాబ్దాల కాలం నుంచి మతపరమైన క్రతువుల్లో, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, కర్మకాండల సమయంలో, వినోదాత్మక సమయాల్లో వివాహాలు, పండుగల వేళ, వివిధ కార్యక్రమాల్లో వివిధ సంగీత వాయిద్యాల ద్వారా భారతీయులను, సంస్కృతిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. వివిధ సంగీత విద్వాంసులు సంగీతంతో మన నైపుణ్యాలను అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకుని వచ్చారు. ఇళయరాజా, కె.వి.మహదేవన్, ఘంటసాల, ఆదినారాయణరావు, చక్రవర్తి, ఏ.ఆర్.రెహమాన్, బాలీవుడ్ ఆర్.డి.బర్మన్, ఓ.పి.నయ్యరణ్, బప్పిలహరి, కళ్యాణ్‌జీ ఆనంద్ జీ వంటి ప్రముఖ సంగీత దర్శకులు జ్ఞప్తికి వస్తే మన భారతీయ సంగీత వాయిద్యాలకు ఆధునికత జోడించి దేశ ప్రజలను, ప్రపంచ వాసులను తమతమ సంగీతాలతో ఓలలాడించారు. ముఖ్యంగా మనదేశంలో సంగీత వాయిద్యాలు, నృత్యం వంటి అంశాలు వేదాల్లో, నృత్య శాస్త్రంలో లిఖించబడినట్లు తెలుస్తోంది. సంగీత దర్శకులకైనా, సంగీత కళాకారులకైనా కొన్ని ప్రత్యేకమైన వాయిద్యాలు అంటే ఇష్టం ఉంటుంది. అటువంటి వాటిలో మనదేశంలో అనాదిగా కొన్ని సంగీత వాయిద్యాలు ముఖ్యంగా వీణ, మృదంగం, తబలా, వేణువు (ఫ్లూట్), సితార, తంబుర, సరోద్, సారంగి, ఘటం వంటివి వివిధ ధ్వనులు చేస్తూ సమయానుకూలంగా ప్రజలకు తన్మయత్వాన్ని, ఆధ్యాత్మిక చింతనను కలుగచేస్తున్నాయి.



సితార వాయిద్యం ఉత్తర భారతదేశంలో, మృదంగం దక్షిణ భారతదేశంలో ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుంది. భారత నృత్యరీతులు ఉత్తర భారతదేశంలో హిందూస్తానీ, దక్షిణ భారతదేశంలో కర్ణాటక సంగీతం బాగా అభివృద్ధి చెందడం బట్టి దానికి అనుగుణంగా వివిధ సంగీత వాయిద్యాలు కూడా అభివృద్ధి చెందాయి. అంతేకాకుండా వివిధ దేవాలయాల్లో పూజా సమయాల్లో, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో వివిధ వాయిద్యాల పాత్ర, సంగీత కళాకారుల పాత్ర ఆనాటి నుంచి నేటి వరకూ అప్రతిహతంగా కొనసాగుతోంది. భారతదేశంలో దాదాపు అన్ని దేవాలయాల్లో, దేవుని మందిరాలలో సంగీత వాయిద్యాలు, ధ్వనులు లేనిదంటూ ఉండదు అంటే అతిశయోక్తి కాదు. భక్తి గీతాలు ఆలపనలో, దేవున్ని మేలు కొలుపుటలో, వివిధ మతపరమైన క్రతువుల్లో సమయానుకూలంగా సంగీ వాయిద్యాలు వాడుతూ ఉంటారు. ఇక పండుగలు, పర్వదినాలు, వేడుకలు, పెళ్లిళ్ల ఫంక్షను సందర్భాల్లో వివిధ సంగీత వాయిద్యాలతో ప్రజలకు సంతోషం, ఆనందం, ఆహ్లాదం కల్పిస్తుంది. ఇక సినిమాల్లో టాకీ సినిమాలు ప్రారంభమైన నాటి నుండి సంగీతం మమేకం అయింది. బ్రిటిష్ వారు రాక తరువాత భారతీయ సంగీతంలో ఆధునిక పోకడలు సంతరించుకుంది. అంతేకాకుండా ఎలక్ట్రానిక్ సంగీత వాయిద్యాలు అభివృద్ధి చెందాయి. జాజ్, రాక్‌వంటి వివిధ సంగీతాలు కూడా భారతీయ సంగీతంలో మమేకం అయ్యాయి. భారతీయ సంగీత కళాకారులు కూడా వివిధ కొత్త సంగీత వాయిద్యాలపై పట్టు సాధిస్తూ ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రపంచాన్ని ఏలుతున్నారు. అందులో ప్రస్తుతం ఏ.ఆర్.రెహమాన్ ఒకరు. అనాదిగా భారతీయ సంగీత వాయిద్యాలు దాదాపు అన్నియు తీగ వాయిద్యాలే. ఒక్కో వాయిద్యం ఒక్కోరకమైన ధ్వని/ శబ్దం చేస్తు మనలను అలరిస్తుంది. 'సితార' వాయిద్యం ప్రపంచ ప్రసిద్ధిగాంచినది. అంతేకాకుండా గ్రామాల్లో డ్రమ్ములు, డోలు సన్నాయి, డోలక్, కంజిర, బూర వంటివి వివిధ సందర్భాలలో వినియోగిస్తారు. ఆధునిక కాలంలో టెక్నాలజీ కూడా అభివృద్ధి చెందడంతో మరింత చక్కని సంగీతం అందుబాటులోకి వచ్చింది. ఒకప్పుడు పూర్తిగా కొంతమందికే అందుబాటులో ఉన్న సంగీతం ఈరోజు ఆసక్తి ఉన్నవారు అందరికీ అందుబాటులోకి రావడంతో కొత్తకొత్త సంగీత కళాకారులు, దర్శకులు తమ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. భరతనాట్యం, కూచిపూడి, కథాకళీ వంటి అనేక నృత్యరీతులు దేశంలో నేటికీ ఆదరణ ఉండడంతో, దీనికి అనుగుణంగా కూడా సంగీత వాయిద్యాలు అభివృద్ధి చెందుతున్నాయి.

సంగీత విభావరి, వేడుకలు, రకరకాల శాస్త్రీయ, జానపద సంగీత పోటీలు నిర్వహిస్తున్నారు. మ్యూజికల్ కన్సర్ట్ నిర్వహిస్తూ, కొన్ని సంస్థలు అవార్డులు ఇస్తున్నారు. సంగీత అకాడమీలు, సంస్థలు, మీడియా, ఛానెల్స్, ఆధ్యాత్మిక కేంద్రాలు సంగీతాన్ని ప్రోత్సహించడం వలన సంగీత వాయిద్యాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇక చలనచిత్రాల్లో పాటలు, డాన్స్ వరవడి అర్థశతాబ్దపు కాలంగా పెరుగుతున్నది. దేశంలో జరిగే అనేక గిరిజన ప్రాంతాల్లో జాతరల్లో, వివిధ నృత్యాల్లో స్థానికంగా లభ్యమయ్యే అనేక వస్తువులతో సంగీత వాయిద్యాలు తయారు చేసి సందర్భానుసారంగా సంగీతం అందిస్తున్నారు. కర్మకాండలు సమయంలోను కొన్ని రకాల ప్రత్యేక వాయిద్యాలతో సంగీతం అందించడం జరుగుతుంది. అనగా మానవుని జీవితగమనంలో జరిగే భక్తి, ఆధ్యాత్మిక, వినోదం, విప్లవ, విషాధ, వివాహాలు, పుట్టినరోజు, పండుగలు, వివిధ వేడుకలు సమయంలో సందర్భానుసారంగా అనాదిగా భారతీయ వాయిద్యాలు, కళాకారులు ప్రజలకు సంగీతం అందిస్తున్నారు. మానసిక ప్రశాంతతకు, ఆధ్యాత్మిక చింతనకు, ఆహ్లాదం ఆనందం కలిగిస్తున్న సంగీత వాయిద్యాలు భారతీయ సమాజంలో ప్రముఖపాత్ర పోషిస్తున్నాయి అని అనటంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు



చదువుతోపాటు సంగీత వాయిద్యాల పట్ల పిల్లలకు ఆసక్తి కల్పించాలి. సంగీతం ద్వారా మానసిక అనారోగ్యాలు నశించి, నూతన ఉత్తేజం, ఉత్సాహం కలిగిస్తుంది అని కూడా వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతకాలంలో దాదాపు అందరూ అన్నిరంగాల్లో ఒత్తిడితో ఉంటున్నారు. దీనికి తక్షణ పరిష్కారం సంగీతమే. మానసిక ప్రశాంతతకు, ఉల్లాసానికి, ఆధ్యాత్మిక చింతనకు సంగీతమే పరమౌషధం అని భావిద్దాం.

# ఫోన్ టైపింగ్ వేగంగా..

కీబోర్డుల్లో మైక్రోసాఫ్ట్ స్విఫ్ట్‌కీ ప్రత్యేకతే వేరు. ఉచితంగా లభించే దీన్ని ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాలు రెండింటిలోనూ వాడుకోవచ్చు. వేగంగా టైప్ చేయటానికి తోడ్పడే కృత్రిమ మేధ (ఏఐ) సపోర్టుతో కూడిన ఇందులో ఫీచర్లూ చాలానే ఉన్నాయి. అలాంటి కొన్ని సదుపాయాల గురించి తెలుసుకుందాం.

**ఇష్టమైన స్టికర్ సృష్టి**

తరచూ స్టికర్లు వాడుతూనే ఉంటాం. ఇప్పటికే ఫోన్‌లో బోలెడన్ని స్టికర్ల కలెక్షన్ ఉండి ఉండొచ్చు. అయితే కొన్నిసార్లు కొత్తవి కావాలని అనిపించొచ్చు. ఇందుకు స్విఫ్ట్‌కీ బాగా ఉపయోగపడుతుంది. దీంతో ఇష్టమైన స్టికర్లను సృష్టించుకోవడం చాలా తేలిక. డాల్-ఈ 3 పరిజ్ఞానంతో పనిచేసే దీన్ని వాడుకోవాలంటే..ముందుగా ఫోన్‌లో స్విఫ్ట్‌కీని ఓపెన్ చేయాలి. పైన ఎడమ వైపున కనిపించే బాణం గుర్తు మీద తాకితే టూల్‌బార్ ప్రత్యక్షమవుతుంది. ఇప్పుడు కీబోర్డుకు పైన కుడిమూలన ఉండే మూడు చుక్కల మీద నొక్కి, స్టికర్స్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అప్పుడు అడుగున మంత్రదండంలాంటి బటన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే టెక్స్ట్ కనిపిస్తుంది. ఇందులో ఎలాంటి స్టికర్ అవసరమో వర్ణించాలి. అంతే తగిన స్టికర్ పుట్టుకొస్తుంది.

**భాషల మధ్య మారటం**

జీబోర్డు మాదిరిగానే స్విఫ్ట్‌కీలోనూ తేలికగా టైప్ చేసే భాషలకు మారొచ్చు. ప్రస్తుతం ఇది ఆండ్రాయిడ్‌లో 700కు పైగా భాషలను సపోర్టు చేస్తుంది. స్పేస్‌బార్ మీద కుడి, ఎడమలకు స్వైప్ చేయటం ద్వారా ఆయా భాషలకు ఇట్టే మారొచ్చు. స్విఫ్ట్‌కీ యాప్‌లో లాంగ్వేజ్ విభాగంలోకి వెళ్లి భాషలను వెతకొచ్చు. అవసరమనుకుంటే వాటిని జత చేసుకోవచ్చు.

**ఫోన్ నుంచి పీసీకి కాపీ, పేస్ట్**

స్విఫ్ట్‌కీలో బిల్టిన్‌గా క్లిప్‌బోర్డు ఫీచరూ ఉంటుంది. దీంతో ఫోన్ నుంచి పీసీకి..అలాగే పీసీ నుంచి ఫోన్‌కు టెక్స్ట్, లింక్‌లు కాపీ, పేస్ట్ చేసుకోవచ్చు. ఒకసారి దీన్ని సెట్ చేసుకుంటే వాడుకోవటం తేలికే. పైన ఎడమ వైపున బాణం గుర్తును నొక్కి టూల్‌బార్ ద్వారా వెళ్లి, క్లిప్ బోర్డు బటన్ మీద తాకాలి. అక్కడ నుంచి ఎనేబుల్ చేసుకోవాలి. కానీ పీసీతో దీన్ని సింక్ చేసుకోవాలంటే యాప్ సూచించే మార్గాలను అనుసరించాలి. ఏఐ ఆధారిత కోపైలట్ ఛాట్‌బాట్ స్విఫ్ట్‌కీలోనూ అందుబాటులో ఉంటుంది. ఫోన్ మీద ఎలాంటి పనిచేస్తున్నా కూడా సెర్చ్ ఛాట్, కొత్త మెసేజ్ కంపోజ్ వంటి ఎన్నో పనులను దీంతో చేయించుకోవచ్చు. కావాలంటే మన తరపున విషయాలను రాసి పెడుతుంది కూడా. స్విఫ్ట్‌కీని ఉపయోగిస్తున్నప్పుడు అన్నింటికన్నా ఎడమవైపున ఉండే బటన్‌ను నొక్కి, టూల్‌బార్ ద్వారా కోపైలట్‌ను చూడొచ్చు. మనం సెర్చ్ చేసే అంశాలపై కీబోర్డు నిఘా వేయొద్దని స్విఫ్ట్‌కీ ఇన్‌కాగ్నిటో మోడ్‌ని వాడుకోవచ్చు. ఇది డిఫాల్ట్‌గా డిసేబుల్ అయ్యుంటుంది. కానీ టూల్‌బార్ ద్వారా తేలికగా ఎనేబుల్ చేసుకోవచ్చు. మూడు చుక్కల మెనూ గుర్తు మీద తాకి ఇన్‌కాగ్నిటో బటన్‌ను ఆన్ చేసుకుంటే చాలు.



కథ

# అమ్మ మాట

అప్పుడే ఉదయిస్తున్న భానుడి నునులేత కిరణాలు సోకడంతో పొదరింట్లో బద్ధకంగా కదిలాడు 'గున్నా'. గున్నా తల్లి ఏనుగుకు పుట్టి మూడు నెలలయింది. మెల్లగా పాక్కుంటూ బయటికి వచ్చాడు. పక్కనే ఉన్న మడుగు దగ్గరకు వెళ్లి తొండంతో నీళ్ల పీల్చుకుని మొహం కడుక్కున్నాడు. పొదరింటికి వచ్చి పళ్లు తిన్నాడు. ఆహారం కోసం వెళ్లిన అమ్మ తిరిగిరావడానికి చాలా సమయం పడుతుంది. బయట తిరగకు అని చెప్పింది. ఏం చేయాలా అని ఆలోచిస్తోండగా 'అన్నా! ఆడుకుందామా' అంటూ వచ్చాడు' బన్నీ. వాడు పక్క పొదరింట్లో ఉండే కుందేలు పిల్లాడు. వాడి పిలుపుతో చటుక్కున లేచి నిలబడ్డాడు గున్నా. బయటికొచ్చి 'ఏమాడుకుందాం' అని అడిగాడు. 'పరుగుపందెం ఆడుదాం' అన్నాడు బన్నీ.



'వద్దు నువ్వే గెలుస్తావ్' అన్నాడు గున్నా.
'పోనీ తాడాట ఆడుదామా?'
'నా శరీరాన్ని చూసే ఆ మాట అంటున్నావా?'
'దాగుడుమూతలు ఆడుదాం' అన్నాడు బన్నీ.
సరేనంటూ మొదలుపెట్టారు.
ముందు బన్నీ వంతు వచ్చింది. దూరంగా వెళ్లి కళ్లు మూసుకుని ఒకటి రెండ్లు లెక్కపెట్టాడు. గున్నా వెళ్లి చెట్టు చాటున దాక్కున్నాడు. అంకెలు అయిపోయాక బన్నీ వచ్చాడు. అల్లంత దూరాన ఉండగానే గున్నా ఎక్కడున్నాడో తేలిగ్గా దొరికిపోతున్నాడు. దాంతో తనకి విసుగొచ్చింది. ఆటలొద్దులే కాసేపు విశ్రాంతిగా కూచుందాం అన్నాడు గున్నా. సరేనంటూ చెట్లకింద పచ్చికలో కూర్చున్నారు. అయితే అది కాసేపే. బన్నీ కుదురుగా ఉండలేకపోయాడు. అటూ ఇటూ ఎగురుతూనే ఉన్నాడు. ఎదురుగా ఉన్న మడుగు ఆకర్షించింది.

'అన్నా! జలకాలాట ఆడుదామా?' అన్నాడు.
'అమ్మో! అమ్మ తిడుతుంది. వద్దని చెప్పింది. రోజూ స్నానం ఒడ్డున నిలబడే చేస్తా' అన్నాడు గున్నా. 'అమ్మలు అలాగే అంటారు. వెళ్దాం రా' అంటూ తొండం పట్టుకులాగాడు బన్నీ. గున్నాకు కూడా మనసులో ఇష్టమే. కాసేపు బయటే నిలబడి నీళ్లు చల్లుకున్నారు. తర్వాత లోనికి దిగారు. కాసేపు ఆనందంగానే గడిచింది. తర్వాత గున్నాకు తాను లోపలికి దిగబడి పోతున్నట్లనిపించింది. బన్నీ నేను మునిగిపోతున్నా అంటూ అరిచాడు గున్నా. ఏం కాదులే మెల్లగా పైకి రా అన్నాడు బన్నీ. అయితే ఎంత ప్రయత్నించినా బయటికి అడుగుపెట్టలేకపోయాడు గున్నా. ఇంతలో వారి అరుపులు విని అక్కడికి వచ్చాడు ఎలుగుబంటి బాబాయి. ఒక పెద్ద కర్ర తెచ్చి గున్నా తొండానికి అందించాడు.
కర్రను పట్టుకొని బయటికి రావాలని ఎంత ప్రయత్నించాడు గున్నా. బన్నీ, బాబాయి ఎంత సాయం చేసినా లాభం లేకుండా పోయింది.
ఇంతలో ఆహారం కోసం బయటకు వెళ్లిన గున్నా తల్లితోపాటు ఏనుగుల గుంపు తిరిగి వచ్చింది. అంతా కలిసి గున్నాని పైకి లాగారు. ఏడుస్తున్న గున్నాని తల్లి ఓదార్చింది. 'నీటిలో దిగవద్దని చెప్పాను కదా' అంది తల్లి.
'నన్ను క్షమించమ్మా! ఇంకెప్పుడూ నీ మాట జవదాటను' అన్నాడు గున్నా తన చిన్ని తొండంతో తల్లిని చుట్టేస్తూ..

– పల్లా వెంకట రామారావు





## బాలగేయం

### అక్కా చెల్లి



అక్కా అక్కా అక్కా
ఆకాశం నీలిగా
ఎందుకుండు?
చెల్లిచెల్లి చెల్లెమ్మ
చక్కగ చెప్తావినమ్మ
వాతావరణంలో
గాలి అణవులుండు
అవి సూర్యకాంతిని
చెదరగొట్టుచుండు
అందువల్లె ఆకాశం
నీలిగా ఉండు
అక్కా అక్కా అక్కా
క్యారెట్ ఎందుకు
ఎర్రగ ఉండును?
చెల్లిచెల్లి చెల్లెమ్మా
చక్కగా చెప్తా వినమ్మా
క్యారెట్‌లో కెరోటిన్
పదార్థం ఉండును?
పదార్థం ఎరుపు
రంగులో వుండును
కనుకనే క్యారెట్
ఎర్రగుండు.

– చాడా మునిశేఖర్‌రెడ్డి

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.కావ్య,** తిరుత్తణి


**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మెదడుకు నిద్ర అవసరమా?**



**జవాబు: కావ్య!** దైనందిన జీవితంలో కొత్త కొత్త నైపుణ్యాలను, నిర్వహణా సామర్థ్యాలను పెంచుకోవడానికి మెదడు పనితీరులో నిద్ర దోహదపడుతుంది. మన వృత్తి, ప్రవృత్తులలో ప్రావీణ్యాన్ని సాధించేందుకు నిద్ర ఒక అనూహ్యమైన విధానంలో మెదడుకు సహకరిస్తుంది. సృజనాత్మకత పెంపొందడంలో కూడా నిద్ర పాత్ర చాలా కీలకమైనది. మెలకువతో ఉన్నప్పుడు సమకూర్చుకున్న సమాచారాన్నంతటినీ సమీక్షించుకుని ధృవపరచు కోవడానికి మెదడుకు నిద్ర తోడ్పడుతుంది. ఆలోచనలకు కావలసిన శక్తిని తిరిగి నింపుకోవడానికి, అనవసరమైన/ అప్రయోజనకరమైన అంశాలను, ఆయా వివరాలను మెదడులో నుంచి మినహాయించడానికి నిద్ర ఉపయోగపడుతుంది.

**- ఎన్.విపిన్,** గాజువాక

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వజ్రాలను ఎందుకు సానబెడతారు?**



**జవాబు: విపిన్!** ముడి స్థాయిలో ఉన్నప్పుడు సాధారణ గాజుముక్క మాదిరిగా కనిపించే వజ్రం కళ్లు మిరుమిట్లు గొలపాలంటే సానపెట్టాలి. వజ్రానికి చెందిన వివిధ ముఖాల నుంచి కాంతిపుంజాలు విరజిమ్మటానికీ, వివిధ రంగులు కనువిందు చేయటనికీ ఇదే కారణం. ఒక వజ్రం ఇష్టపడే ఆకారం అనేది వ్యక్తిగత అభిరుచుల మీద ఆధారపడి ఉంటుంది. చాలా మంది మాత్రం గుండ్రంగా వుండే వజ్రాలనే ఇష్టపడతారు.

# ప్రమాదంలో ఆధునిక జీవనశైలి!

**నేటి ఆధునిక వేగవంతమైన యాంత్రిక డిజిటల్ తెరల జీవితాల్లో గుండె జబ్బులు, వెన్నునొప్పులు, టైప్-2 మధుమేహం, కేన్సర్, ఉబ్బసం, కీళ్లనొప్పులు, అకాల మరణాలు, ఎముకల బలహీనతలు, కండరాలు బలహీనపడడం, గుండె/ ఊపిరితిత్తులు బలహీన పడడం, కణజాల వ్యవస్థలు అవస్థపడడం, స్థూలకాయ సంబంధ రుగ్మతలు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలులాంటివి సర్వసాధారణం అయ్యాయి.**

డా ॥ బుర్ర మధుసూధనరెడ్డి

అందువల్లనే 'సిట్టింగ్ ఈజ్ కిల్లింగ్' (అల్ప చలనశీలత లేదా నిశ్చల స్థితి ప్రాణాంతకం) అనే నినాదం తరచుగా, తీవ్రస్వరంతో వినిపిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 25శాతం జనాభా రోజుకు 8 లేదా అంతకన్న ఎక్కువ గంటలు సీట్లకు అతుక్కుపోతున్నారని తెలుస్తున్నది. శారీరక వ్యాయామం కొరవడడంతో ఏటా 6శాతం మరణాలు సంభవిస్తున్నాయని, 3,2 మిలియన్ అభాగ్యులు మరణిస్తున్నారని తెలుస్తున్నది. నిత్యజీవనశైలిలో శారీరక కదలికలు లేదా వ్యాయామాలు తగ్గడంతో అల్ప చలన వ్యాధులు లేదా హైపోకైనెటిక్ డిసీజెస్ మానవాళిని ఉప్పెనలా ముంచనున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.



### హైపోకైనెటిక్ వ్యాధులు అనగా..

'హైపో' అనగా 'అల్ప' అని, 'కైనెటిక్' అనగా 'చలనం' అని అర్థం చేసుకోవాలి. మన వయస్సు, అనువంశికత, లింగం లాంటివి మన చేతుల్లో ఉండవు. వాటిని మనం ప్రభావితం చేయలేం. ఇలాంటి చలనశీల రహిత జీవన విధానంలో ప్రతి ఒక్కరు కొన్ని మార్పులు చేసుకొన్న యెడల సంపూర్ణ ఆరోగ్యభాగ్యాలతో జీవితాలు సాఫీగా సాగుతాయని గమనించాలి.

### శారీరక వ్యాయామం

ప్రతిరోజు మన దైనందిన జీవితాల్లో కనీసం 30-60 నిమిషాల పాటు శారీరక వ్యాయామానికి తప్పనిసరిగా కేటాయించాలి. మన వయసు, ఆసక్తులను బట్టి కాలినడక, రన్నింగ్, మైదాన క్రీడలు, సైక్లింగ్, యోగా, ప్రాణామాయం, ధ్యానం, జిమ్ వ్యాయామాలు లాంటివి ఎంచుకొని తప్పనిసరిగా పాటించాలి. శారీరక శ్రమకు దూరమైతే హైపోకైనెటిక్ లేదా అల్ప చలనశీల వ్యాధులు/ రుగ్మతలకు దగ్గరవుతామని తెలుసుకోవాలి.

**ఆహారపు అలవాట్లు:** మనం నిత్యం తీసుకునే ఆహారపు అలవాట్లు మన ఆరోగ్యానికి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయని గమనించాలి. అధిక సంతృప్తి కొవ్వులు (సాచురేటెడ్ ఫాట్స్), అధిక లవణ వాడకం, అపరిమిత మాంసాహారం, కూరగాయలు / ఆకుకూరలను తక్కువగా తీసుకోవడం, చక్కర వాడకాన్ని తగ్గించడం లాంటి అసాధారణ ఆహారపు అలవాట్లు మన రుగ్మతలకు కారణం అవుతాయి. నిత్యం దినచర్యలో మార్పులు, పోషహాకారం తీసుకోవడంలో అశ్రద్ధలాంటివి రోగాలకు దగ్గర చేస్తాయి.

### అధిక కొవ్వుతో స్థూలకాయం

శారీరక వ్యాయామం తగ్గి, అధిక కొవ్వు కలిగిన ఆహారాన్ని అపరిమితంగా తీసుకొన్న సందర్భాల్లో శరీర బరువు పెరగడం, శరీరం లావెక్కడం, శరీరంలో కొవ్వు పేరుకుపోవడం, స్థూలకాయ సమస్యలు ఉత్పన్నం కావడం మనకు తెలియకుండానే ప్రమాదకర రుగ్మతలు మనల్ని చుట్టి ప్రాణాంతకంగా మారతాయి. అన్ని తెలిసి మన ఆరోగ్య పరిరక్షణకు మనమే కంకణబద్ధులం కానియెడల మనం తవ్వుకున్న గోతిలో మనమే పడాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలి. అధిక కొలెస్టరాల్, ట్రైగ్లిజరైడ్స్, అల్పసాంద్రత కలిగిన లిపోప్రోటిన్లు, రక్తంలో గ్లూకోజ్, రక్తపోటు లాంటివి అనారోగ్య హేతువులుగా గుండెజబ్బులకు, మధుమేహ సమస్యలకు దారితీస్తాయని మరిచిపోవద్దు. ఈ అంశాలన్నీ పరిమితిని దాటితే రక్తంలో కొవ్వులు పెరిగి తీవ్ర అనారోగ్యం బారిన

పడాల్సి వస్తుంది.

### పొగాకు దురలవాటు

పొగతాగే అలవాటు ఐదురెట్ల గుండె జబ్బుల బారినపడాల్సి వస్తుందని వివిధ అధ్యాయనాలు వెల్లడిస్తూ హెచ్చరికలు చేస్తున్నాయి. పొగాకు దురలవాటుతో అధిక బీపీ, కేన్సర్‌లాంటి పలు ఇతర తీవ్రజబ్బులు కలుగుతాయని తెలుసుకోవాలి. పొగాకు దురలవాటుకు దూరం అయితే హైపోకైనెటిక్ వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని తెలుస్తున్నది. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన వ్యక్తుల్లో హైపోకైనెటిక్ వ్యాధుల సమస్యలు పలు రెట్లు పెరుగుతాయి. తీవ్ర ఒత్తిడితో హృద్రోగ సమస్యలు, వెన్ను నొప్పులు దరి చేరతాయని మరువకుండా జాగరూకతతో ఉండాలి.




నిత్యం శారీరక శ్రమ లేదా వ్యాయామం చేయని యెడల ఆరోగ్య సంక్షోభం ఏర్పడి వైద్యఖర్చులు పెరగడం, పేదరిక ఊబిలోకి జారిపోవడం జరుగుతుందని గమనించాలి. దీర్ఘకాల శారీరక శ్రమ లేదా వ్యాయామాలకు దూరం అయినప్పుడు మధుమేహం, బీపీలాంటి రుగ్మతలు పెరుగుతూ 2వ, 3వ దశ అనారోగ్యాలు కలిగి గుండె జబ్బులపాలు కావడంతో హార్ట్ అటాక్ హార్ట్‌స్ట్రోక్‌ల సంభావ్యత కూడా పెరుగుతుంది. మన జీవనశైలిలో శారీరక కదలికలకు చోటివ్వడం, పరిమిత పోషకాహారం తీసుకోవడం, మానసికంగా ప్రశాంత సమయాన్ని గడపడం, అనవసర హైరానాకు తావు ఇవ్వకుండా క్రమశిక్షణ కలిగిన ఆరోగ్యకర సమాజస్థాపనకు మనం కూడా కారణం అవుదాం, ఆరోగ్య భారతాన్ని నిర్మించుకుందాం. హింసాత్మక సంఘటనలకు దూరంగా ఉండడం, ట్రాఫిక్ రద్దీలో అధిక సమయం గడపడం, కాలుష్యం, గ్రీన్ కవర్ తగ్గడం, మోటార్లు వాహన రవాణాకు మొగ్గుచూపడం, తీరిక సమయాల్లో డిజిటల్ తెరల విషవలయంలో దూరం, క్రీడా మైదానాలు/ పార్కులు/ వాకింగ్ ట్రాక్ సౌకర్యాలు లోపించడం లాంటి కారణాలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

నిత్య వ్యాయామం ఓ అద్భుత ఔషధమని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే భద్రంగా ఉందని మరువరాదు. వ్యాధి చికిత్స కన్న వ్యాధి రాకుండా జాగ్రత్తపడడం ఉత్తమమని రుజువు చేద్దాం. చేతులు కాలకముందే ఆకులు సిద్ధం చేసుకుందాం. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందాం. ఆరోగ్యంగా ఉండడా నికి నిత్యం కొంత చెమట కక్కే ప్రయత్నం చేద్దాం.

---

# మెదడులాంటి కంప్యూటర్



మనిషి మెదడులా పనిచేసే, ఒకే సమయంలో వేర్వేరుగా స్పందించే కంప్యూటర్లను రూపొందించాలని చాలాకాలంగా ప్రయత్నిస్తు న్నారు. ఈ దిశగా ఇంటెల్ శాస్త్రవేత్తలు ముందడుగు వేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద న్యూరోమార్ఫిక్ కంప్యూటర్‌ను రూపొందించారు. మనిషి మెదడును అనుకరించేలా డిజైన్ చేసిన దీని పేరు 'హలా పాయింట్'. ఇది కృత్రిమ మేధ (ఏఐ) పనులనూ 50రెట్లు వేగంగా చేయగలదు. అదీ సంప్రదాయ కంప్యూటర్ వ్యవస్థలకు అవసరమైన దాని కన్నా 100 రెట్లు తక్కువ విద్యుత్తుతో భౌతికశాస్త్రం, కంప్యూటర్ ఆర్కిటెక్చర్, కంప్యూటర్ సైన్స్‌లో ఇప్పటికీ కొరుకుడు పడని అంశాలెన్నో ఉన్నాయి. వీటిని అవగతం చేసుకోవటా నికి అధునాతన కంప్యూటింగ్ వ్యవస్థలు అవసరం. అందుకే హలా పాయింట్‌ను ముందుగా న్యూ మెక్సికోలోని సాండియా నేషనల్ లేబరేటరీస్‌లో నెలకొల్పనున్నారు. ఇందులో ఇంటెల్ రూపొందించిన అధునాతన లొయిహి 2 ప్రాసెసర్లు 1,152 వరకూ ఉంటాయి. వీటన్నింటిని కలిపి భారీ న్యూరోమార్ఫిక్ రీసెర్చ్ చిప్ అనుకోవచ్చు. సుమారు 115 కోట్ల ఆర్టిఫిషియల్ న్యూరాన్లు, 12,800 కోట్ల ఆర్టిఫిషియన్ సైనాప్సెస్‌తో కూడుకొని ఉండే ఇది సెకను 20 క్వాడ్రిలియన్ పనులు చేయగలదు.

### ఎందుకింత ప్రాధాన్యం?

హలా పాయింట్ తక్కువ విద్యుత్తుతోనే ఎక్కువ పనులు చేస్తున్నట్టు ప్రాథమిక పరీక్షలుచెబుతున్నాయి. ఇది ఒక వాట్‌కు 15 ట్రిలియన్ల ఏఐ పనులను (టాప్స్ పర్ వాట్) చేసి పెడుతోంది. ఇంత పని చేయాలంటే సంప్రదాయ కంప్యూటింగ్ వ్యవస్థలకు 10 టాప్స్ పర్ వాట్ విద్యుత్తు అవసరం. అందువల్ల త్వరగా పనులు చేయటానికే కాకుండా పర్యావరణ పరిరక్షణకూ తోడ్పడుతుంది. ప్రస్తుతానికి న్యూరోమార్ఫిక్ కంప్యూటింగ్ అభివృద్ధి దశలోనే ఉంది. హలా పాయింట్ వంటి యంత్రాలను మరికొన్ని చోట్ల వినియోగిస్తున్నారు. ఆస్ట్రేలియా లోని వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీకి చెందిన ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ న్యూరోమార్ఫిక్ సిస్టమ్స్ పరిశోధకులు గత సంవత్సరం ఇలాంటి పరికరాన్నే రూపొందించారు. దాన్ని డీప్‌సౌత్ అని పిలుచుకుం టున్నారు. అది సెకనుకు 228 ట్రిలియన్ సైనాప్టిక్ ఆపరేషన్స్ వేగంతో స్పైకింగ్ న్యూరాన్స్‌ను ఉత్తేజితం చేయగలదు. ఇది మనిషి మెదడుతో సమానమైన వేగమని భావిస్తున్నారు. హలా పాయింట్‌ను ప్రస్తుతానికి పరిశోధనల కోసమే ఉపయోగిస్తు న్నప్పటికీ మున్ముందు వాణిజ్యపరం గానూ వినియోగించే అవకాశముందని అనుకుంటున్నారు.

### ఎలా పనిచేస్తుంది?

సూపర్ కంప్యూటర్ల కన్నా న్యూరోమార్ఫిక్ కంప్యూటర్లు భిన్నంగా డేటాను ప్రాసెస్ చేస్తాయి. నిజానికి సంప్రదాయ కంప్యూటింగ్ వ్యవస్థలతో పోలిస్తే న్యూరోమార్ఫిక్ కంప్యూటింగ్ నిర్మాణమే భిన్నంగా ఉంటుంది. ఇవి న్యూరల్ నెట్‌వర్క్స్‌తో పనిచేస్తాయి. మామూలు కంప్యూటర్లలో బైనరీ బిట్స్ (1,0) సీపీయూ, జీపీయూ, మెమరీ వంటి హార్డ్‌వేర్లలోకి ప్రవహిస్తాయి.

సుస్మితా రమణమూర్తి

కథ

# ఒక్కొక్క మెట్టే

ఆనంద్ మాస్టారు పార్కు చివరలో బెంచీపై కూర్చున్నారు. కాసేపటి తరువాత పార్కుకి పక్కనే ఉన్న చెరువు వేపు వడివడిగా వెళ్తున్న యువకుణ్ణి చూసారు.

అనుమానంతో వెంటనే ఆవేపు వెళ్లారు. అతను చెరువులోకి దూకబోతుంటే తన చేతిని గట్టిగా పట్టుకుని ఆపారు. పక్కన పడేసి ఉన్న సంచిని, సర్టిఫికెట్ల ఫైలుని తీసుకుని పార్కులోకి తీసుకువచ్చారు తనను.

సర్టిఫికెట్లు చూసి మాస్టారు ఆశ్చర్యపోయారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ దాకా అన్నీ ఫస్ట్ క్లాసులు, డిస్టింక్షన్లే!

“ఎక్సలెంట్ స్టడీ గ్రాఫ్!” అంటూ మెచ్చుకున్నారు.

నిర్జీవంగా నవ్వుతూ అన్నాడతను.


“అవి ఉద్యోగానికి పనికిరాని సర్టిఫికెట్లు సార్!”

“నీ పేరేమిటి బాబూ? ఉండేది ఇక్కడేనా?”

“నా పేరు రాజు సార్! విజయవాడ నుంచి వచ్చాను. ఓ కంపెనీలో ఇంటర్వ్యూకి ఉదయమే వెళ్లాను. ఫైనల్ రౌండులో పోయింది. సెకండు క్లాసు వచ్చినవారు కూడా సెలెక్ట్ అయ్యారు” నిస్పృహగా చెప్పాడు.

మాస్టారుకి రాజు పరిస్థితి అర్థం అయింది.

“నీవే లేకుంటే ఉద్యోగం వస్తుందా?” ఉండి సాధించాలి. అమ్మా నాన్నలను సంతోషపెట్టాలి”



తనది తొందరపాటు చర్యని గ్రహించి మౌనం వహించాడు రాజు.

“చీకటి పడుతోంది. మా ఇంటికి రా బాబూ! రేపు మీ ఊరికి వెళ్లొచ్చు. మరో ప్రయత్నం చెయ్యి. తప్పక ఉద్యోగం వస్తుంది”.

“మీకెందుకు శ్రమండీ? పది సార్లు ప్రయత్నించినా రాని ఉద్యోగం, మరో ప్రయత్నంలో వస్తుందన్న నమ్మకం నాకైతే లేదు సార్!”

“ముందు ఆ నిస్పృహ లోంచి బయట పడు బాబూ! ఈ రోజుల్లో ఉద్యోగానికి డిగ్రీల మార్కుల కొలమానం ఒక్కటే కాదు. చాలా అర్హతలు కావాలి. నేటి అపజయం రేపటి విజయానికి పాఠంలా ఎలా మార్చుకోవాలో నేను చెబుతాను, నన్ను నమ్ము. ఉద్యోగం వచ్చే మెలకువలు చెబుతాను”

నమ్మకం కలిగించే మాస్టారు మాటలు రాజుని వారితో వెళ్లేలా చేసాయి. రాత్రంతా ఆలోచనలతో సతమతమైన రాజుకి నిద్ర సరిగ్గా పట్టలేదు. ఆలస్యంగా లేచాడు.

ఉదయం ఎనిమిదవుతోంది. పిల్లలు పాఠాలు చదువుతుండటం వినిపించింది. అరగంటలో తయారై వరండాలో పాఠాలు చదువుతున్న పిల్లల దగ్గరకు వెళ్లి, మాస్టారు పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు రాజు.

“మీరు ఉపాధ్యాయులా?” అడిగాడు.

“అవును.. విశ్రాంత హైస్కూలు హెడ్ మాస్టారుని. వీళ్లంతా చుట్టుపక్కలున్న పేద పిల్లలు. పదో క్లాసు దాకా ఉన్నారు. వీరితోనే నాకు కాలక్షేపం. వీరిలో స్కూలు ముఖం చూడనివారు కూడా ఉన్నారు. తెలివైన పిల్లలను స్కూల్లో చేర్పించి, పదో క్లాసు పబ్లిక్ పరీక్ష దాకా ఉచితంగా పాఠాలు చెబుతున్నాను” మాస్టారు చెప్పారు.

“మీకు పిల్లలు లేరా సార్!”

“లేకేం! అబ్బాయి, అమ్మాయి. బాగా చదువుకున్నారు, విదేశాలలో ఉంటున్నారు. ఎప్పుడైనా ఫోన్లోనే పలకరింపులు” నవ్వుతూ చెప్పారు.

“విద్యాదానం చేస్తున్నారా.”

రాజు ప్రశ్నకు నవ్వేసారు వారు.

“పిల్లలూ! నిన్న నేను చెప్పిన పాఠం బాగా చదువుకుని వచ్చారు కదా! నేనిచ్చిన ప్రశ్నలకు మీ స్వంత మాటల్లో జవాబులు రాయండి. తర్వాత నేను అడిగినవారు మాత్రమే వాటికి జవాబులు చెప్పాలి”

“ఓ...! అలాగే సార్!!”

పిల్లలు ప్రశ్నలకు జవాబులు చూడకుండా తమ స్వంత మాటల్లో రాస్తున్నారు.

“మాస్టారూ! స్వంత మాటల్లో రాస్తే మార్కులు పూర్తిగా రావు. పుస్తకంలో ఉన్నట్లు రాస్తేనే పూర్తి మార్కులు వస్తాయి” రాజు మాటలకు నవ్వుతూ

“కంఠస్థం చేసి మక్కీకి మక్కీ పుస్తకంలో ఉన్నట్లు రాస్తే ‘కాపీ’ చేసారని అనుకోవచ్చు. స్వంతంగా రాస్తేనే మంచిది. ఈ ప్రయత్నం మార్కుల గురించి కాదు. చిన్న క్లాసుల నుంచే పిల్లలు స్వంతంగా తమ భావాలు వ్యక్తం చేయడానికి!” అన్నారు.

రాజుకి వారి ఆంతర్యం అర్థం అయింది.

“పిల్లలూ! రేపు నేనిచ్చే టాపిక్ మీద అందరూ అయిదేసి నిమిషాలు మాట్లాడాలి”

“డిబేటా సార్!” రాజు అడిగాడు.

“అవును! అలాంటిదే. స్వంత మాటల్లో భావ వ్యక్తీకరణకు ధైర్యంగా మాట్లాడడం అలవాటు అవడానికి డిబేట్ చాలా అవసరం”.

పిల్లల భవిష్యత్తు కోసం మాస్టారు వేస్తున్న పునాదికి, రాజు వారిని ప్రశంసించకుండా ఉండలేకపోయాడు.

“మీలాంటి నిస్వార్థ మాస్టారు దొరకడం ఈ పిల్లల అదృష్టం సార్! నాకు కూడా ఏదైనా టాపిక్ ఇప్పుడే ఇవ్వండి. నాలుగు మాటలు చెప్పే ప్రయత్నం చేస్తాను”.

“నీ లాంటి విద్యాధికులకు, ఉద్యోగం తొందరగా రావడానికి అవసరమైన చిట్కాలు, సులువు పద్ధతులు చెబుతాను... తొందరపడకు”.

మాస్టారి మాటలకు తలూపాడు రాజు.

“ఈ ప్రణాళిక నీ కోసమే!” అంటూ మాస్టారు ఓ కాగితం ఇచ్చారు రాజుకి.

ఆ కాగితం చూసి రాజు ఆశ్చర్యపోయాడు.

“ఇదేమిటి? స్కూలు పిల్లల టైమ్ టేబుల్లా ఉందే!?”

“అవును.. అలాంటిదే! మేధావులైన నేటి యువతకు కావాల్సినదిదే!”


**“ఈ ప్రణాళిక నీ కోసమే!” అంటూ మాస్టారు ఓ కాగితం ఇచ్చారు రాజుకి.**

**ఆ కాగితం చూసి రాజు ఆశ్చర్యపోయాడు.**

**“ఇదేమిటి? స్కూలు పిల్లల టైమ్ టేబుల్లా ఉందే!?”**

**“అవును.. అలాంటిదే! మేధావులైన నేటి యువతకు కావాల్సినదిదే!”**


మాస్టారి భావం రాజుకి అర్థం కాలేదు.

“మీలాంటివారు లైబ్రరీలోని వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు, తెలుగు, ఇంగ్లీషు దినపత్రికలు, స్పోర్ట్స్ మేగజైన్లు, కెరీర్ గైడెన్స్ పుస్తకాలు లాంటివి క్రమం తప్పకుండా ఈ ప్రణాళిక ప్రకారం చదివితే క్లాసు పుస్తకాల జ్ఞానానికి లోక జ్ఞానం తోడవుతుంది. తద్వారా ఆత్మ స్థైర్యం అంటే సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లెవెల్స్ బాగా పెరుగుతాయి”.

చదువుతో పాటు అన్ని విషయాలలో అవగాహన కూడా ఉండాలన్న మాస్టారి అభిప్రాయం రాజుకి అర్థం అయింది.

తను గ్రూపు డిస్కషన్స్‌లో ఎందుకు చురుగ్గా పాల్గొనలేకపోతున్నాడో తెలుసుకున్నాడు రాజు.

మాస్టారు గారి పాఠాలు పిల్లలకే కాదు, తనలాంటి వారికి కూడా ఎంతో అవసరమని గుర్తించగలిగాడు.

“రాజూ! రోజూ నచ్చిన విషయం గురించి రెండు పేజీలు రాయడం ప్రారంభించు. ఆ తర్వాత ఆ విషయం గురించే పది నిమిషాలు పేపరు చూడకుండా మాట్లాడటం ప్రాక్టీసు చేయి. ఇలా చేస్తుంటే ఇంటర్వ్యూలలో స్వంతంగా ఏ విషయం గురించైనా ధైర్యంగా భావ ప్రకటన చేయగలవు. నలుగురితో చర్చలలో చురుగ్గా పాల్గొనగలవు. ఆత్మస్థైర్యం పెరుగుతుంది”.

మాస్టారు మాటలతో రాజు తనలోని లోపాలు తెలుసుకోగలిగాడు.

“మా చిన్నప్పుడు స్కూల్లో టీచర్లు దినచర్యలు రాయించేవారు. వ్యాస రచన పోటీలు పెట్టి బహుమతులు ఇచ్చేవారు. డిబేట్లు నిర్వహించేవారు. పాటలు పాడించేవారు. నాటికలు వేయించేవారు. ఊళ్లో ఉన్న సందర్శనా స్థలాలకు తీసుకువెళ్లేవారు. అందువల్లే మాకు విషయ పరిజ్ఞానం పెరిగి, చిన్నప్పటి నుంచే స్వంతంగా మా భావాలను వ్యక్తపరచడం అలవాటైంది. భయం లేకుండా, తడబడకుండా అందరిలో మాట్లాడగలిగేవాళ్లం”.

మాస్టారు మాటలు రాజు ఆసక్తిగా వింటున్నాడు.

“చూడు బాబూ! నా సూచనలు విజయ పీఠం అధిరోహించడానికి ఎక్కాల్సిన మెట్లు లాంటివి. ఒక్కో మెట్టు ఎక్కడానికి ఎంత సమయమన్నది ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. అన్ని మెట్లు ఒకేసారి ఎవరూ ఎక్కలేరు. నిదానంగా ఒక్కొక్క మెట్టు ఎక్కితేనే విషయ పరిజ్ఞానం పెరిగి విజయం సాధించగలరు. నాకు తెలిసింది చెప్పాను. సాధన చేస్తే ఫలితం తప్పక సిద్ధిస్తుంది”.

మాస్టారి బోధనల ప్రభావంతో తనను ఆవరించిన అజ్ఞానపు తెరలు ఒక్కొక్కటి తొలగిపోతుండటంతో రాజు తను చేరాల్సిన గమ్యం వైపు ఆత్మస్థైర్యంతో అడుగులు వేయడానికి సమాయత్తం అవుతున్నాడు.

---

## జోక్స్ కార్నర్

### భర్తని అదుపులో..

భర్త: “టీవీ సీరియల్స్ చూసి ఏమి నేర్చుకున్నావు?” అన్నాడు భార్యతో.

భార్య: “భర్తని ఎలా అదుపులో పెట్టాలో నేర్చుకున్నానండీ!” అంది అతి వినయంగా.

### ఇంట్లో ఉన్నానా?

భార్య: “మీరు అసెంబ్లీలో వున్నాననుకుని మీ ఇష్టమొచ్చినట్లు అరుస్తున్నారు..” అంది లక్ష్మి.

భర్త: “క్షమించు లక్ష్మి, ఇంటి దగ్గర ఉన్నానన్న విషయం మరిచిపోయాను” అన్నాడు లక్ష్మణ్‌రావు.

**- వైదా ఈశ్వరరావు,** విశాఖ

### వాకింగ్ టైం..

సుబ్బారావు: బండి రిపేర్‌కి వచ్చిందా? తోసుకుంటూ వెళ్తున్నారు.

పిసినారి వెంకట్‌రావు: పెట్రోల్ అయిపోయిందండి.

సుబ్బారావు: పక్కనే పెట్రోల్ బంక్ వుండి కదండీ.

పిసినారి: ఇది నాకు ఈవెనింగ్ వాకింగ్ టైం. రేపు ఉదయం వాకింగ్‌కు వెళ్లినప్పుడు బండి తీసుకెళ్లి పెట్రోల్ పోయించుకుంటా.

### బిస్కెట్లున్నాయిగా..

పోలీస్: ఆ ఇంటి ముందు కుక్క ఉంది జాగ్రత్త అని బోర్డు ఉంది కదా. అంత ధైర్యంగా లోపలికి ఎలా వెళ్లావు?

దొంగ: నా దగ్గర ఎప్పుడూ ఒక బిస్కెట్ ప్యాకెట్ ఉంటుంది సార్.

**- ఎస్.కె.యాకుబ్‌పాషా,** ఖమ్మం

# నాన్నకు లేఖ

యామిజాల జగదీశ్

**కుమార్తె ముఖాన్ని చూసి ఆమె అంతరంగాన్ని అర్థం చేసుకోవడమనేది తండ్రికి మాత్రమే సాధ్యం.**

**నాన్నల పోరాటాలే కుమార్తె జీవితాన్ని వర్ణమయం చేస్తుంది.**

**నాన్న గుప్పెట్లో కూతురుండదు.. కూతురు గుప్పెట్లోనే నాన్నలుంటారు.**

**ఉయ్యాలతో మొదలయ్యే వీరి మధ్య పుట్టుకొచ్చే ప్రేమబంధం ఎప్పుడూ అందంగానే ఉంటుంది.**

నాన్నా..

ఆశలు లేనివారు!

కోపిష్టి!

ఇంట్లో ఏం జరుగుతోంది?

ఇల్లెలా గడుస్తోంది? అనేవి తెలియని మనిషి.. పట్టించుకోరసలు.

ఏదో ఉద్యోగానికి వెళ్లి జీతం తీసుకురావడంతో సరి.

అంతేతప్ప మిగిలినవేవీ తెలీదు. నువ్వు చేసిన తప్పు నాన్నకు తెలిస్తే తోలు తీస్తారు.. అమ్మ హెచ్చరికలు ఉంటూనే ఉంటాయి.

ఇలా నాన్నల రూపాలను వివిధ కోణాలను ఆపాదిస్తారు.

నాన్నను మిత్రుడిలా, అమ్మలా, అన్నిటికీ ప్రతిరూపంలా గ్రహించి భుజాలపై వాలి ఏడ్చిన తరుణం మనందరి జీవితాల్లో ఉంటుంది.

ఆ నిమిషంలో ప్రపంచం యావత్తూ వెంట ఉన్నట్టు ఓ కొత్త నమ్మకం కలుగుతుంది.

తన గురించి ఆలోచించడానికి సమయం లేని నాన్నలు, పిల్లల జీవితంలో పలు అద్భుతాలు చేసి ఉంటారు.

మా నాన్న.. కృతజ్ఞతలు ఆశించని తండ్రులకు కుమార్తెల తరపున ఈ ప్రేమలేఖ.

నాన్నా.. నాన్నా!

నాన్నలకు ఏడవటం తెలీదట.

ఎవరు చెప్పారు?

నాన్నల కన్నీరుని మనం చూడలేదంతే!

ఏడ్పుని అణచుకోవడమే జీవితంలో అతి పెద్ద దుఃఖపూరితమైన విషయం.

ప్రసవ గదిలో మన పుట్టుక కోసం ఊపిరి బిగపట్టి అమ్మ అరచిన సమయంలో గది బయట నిరీక్షించే నాన్న మరెంత కంగారుపడుతుంటారో ఎందరికి తెలుసు? ఊహూ...

తాను కలత పడితే కుటుంబం ముక్కలవుతుందనే అభిప్రాయంతో పలు సమయాలలో నాన్నలు ఏడవరు.

కన్నీటిని అణచిపెట్టి ముఖాన నవ్వుని చూపించే నాన్నలకు కష్టాలను మోయడం అనేది అలవాటైపోయింది.

కొడుకు పుడతాడు అనే ఆశతో కూడిన నిరీక్షణలో ఉన్నారట మా నాన్న.



అది నాటి ఆశ.. నిరీక్షణ.

కనుక ఈ నిరీక్షణనూ ఆశనూ నేను తప్పు పట్టడం లేదు.

కానీ కొడుకుకోసం నిరీక్షిస్తున్న వేళ కూతురు పుట్టిన తర్వాత తన కూతురే ప్రపంచంగా మారాక నాన్నల ప్రేమపాశాలతో కూతుళ్ల ప్రపంచానికిచ్చే అందం మాటల్లో చెప్పలేనిది.

కూతురు ఎదిగేకొద్దీ పురుషాధిక్యం క్రమేపీ రాలిపోతూ తెరమరుగైపోతూ ఆ ప్రేమకు దాసులైపోతారు నాన్నలు.

అలాగే మా నాన్న నేను ఎదిగేకొద్దీ తానూ ఎదిగారు.

స్త్రీ దాసోహం అనేది ఆలోచన నుంచి తనను ఇవతలకు తీసుకొచ్చి నన్ను ఎత్తుకున్నదో.. బుజ్జగించిందో.. ముద్దాడిందో నాకు గుర్తు లేదు. కానీ నా కోసం నీడై నిలిచిన మా నాన్న పడిన శ్రమే ఈరోజు నా అస్తిత్వానికి చిహ్నమైంది.

అరిగిపోయి పలు కుట్లతో ఉండేదే నాన్న చెప్పు.

ముడతలతోనూ చినుగులతోనూ కనిపించే నాన్న చొక్కా.

నాన్న చేతిరేఖలు చెరిగిపోయి ఆచూకీ కోల్పోయి ఉంటాయి.

నాన్న పర్సు ఎప్పుడు ప్రాణాలు వదులుదామా అనే దుస్థితిలో ఉంటుంది.

దానికీ చిరుగులూ... కుట్లూ.

"కొత్త చెప్పులు కొందాం నాన్నా" అన్నప్పుడల్లా...

ఆయన ఆ మాటకు జవాబే ఇవ్వరు. మౌనంగా పాత చెప్పులతోనే అడుగులేస్తారు.

బదులుగా నీకు యూనిఫాం కొనాలి, నీ పుట్టిన రోజుకి బట్టలు కొనాలి? అని ఆయన ఆలోచనలు ముడిపడి ఉంటాయి.

నేను పుట్టడానికి ముందువరకూ నాన్న ఇంత పొదుపుగా ఉండేవారు కాదట. దుబారా మనిషి. పిల్లలంటూ పుట్టాకే నాన్నిలా బాధ్యతతో గడిపారన్నది ఆయన చర్యలతో తెలిసింది.

సైకిల్ తొక్కడం మొదలుకుని వీధిలో ఆడటం వరకూ ఇవన్నీ ఆడపిల్లలకు అవసరమా అని ఎన్నో ప్రశ్నలు, చులకనమాటలూ నన్ను వెంటాడినప్పుడల్లా నా ఆశలకు తోడున్నది నిన్నే.

నేను వేదికలపై బహుమతులు అందుకుంటున్నప్పుడు నాన్నను ప్రేక్షకులలో ఒకరిగా కనిపించేవారు కాదు. నాన్న చేతులు నా కోసం ఇంకెక్కడో శ్రమిస్తుండేవి.




కానీ స్కూల్లో నేను బహుమతిగా అందుకున్న పళ్లాన్నీ, గ్లాసునీ తరచూ తాకుతూ గొప్పగా చూసుకునే నాన్న ప్రేమను ఎలా వివరించాలో తెలీదు.

నాన్న కాఠిన్యం చూసినప్పుడు "ఆయనకు మన మీద ప్రేమ, శ్రద్ధ లేదేమో" అనిపించేది. కానీ స్కూల్లో టీచర్ నన్ను కొట్టి కన్నీరుమున్నీరైనప్పుడు ఆయన స్కూలుకొచ్చి ఆ టీచరు మీద విరుచుకుపడటం, జ్వరంతో నేను పడుకున్నప్పుడు ఆయన పక్కనే ఉండటం.. ఆందోళన పడటం చూసినప్పుడు ప్రపంచంలో ఇంత ప్రేమ ఉన్న నాన్న ఇంకెక్కడున్నా ఉంటారా అని అనుకున్న తరుణాలున్నాయి.

ఆడవాళ్ల వయసుకొచ్చేస్తే నాన్నతో సహా ఏ మగాడినీ దగ్గరకు రానివ్వకూడదన్నది గ్రామాలలో రాయని చట్టం. కానీ వీధులలో ఎప్పుడూ చేయి పట్టుకుని, విజయాలు సాధించినప్పుడు హత్తుకుని ఆనందానుభూతి పొందిన నాన్న మిగిల్చిన జ్ఞాపకాలెన్నెన్నో...

వయస్సు కొచ్చిన తర్వాత లంగా, పరికిణీ నేను చదువుకున్న స్కూలు యూనిఫాం. అయినప్పటికీ మైదానాలలో ఆడుకుంటున్నప్పుడు ఈ డ్రెస్ కోడ్ ఒకింత ఇబ్బందిగానే ఉండేది. దాంతో చాలా మంది అమ్మాయిలు ఆటలు ఆడుకోవడానికి వచ్చేవారు కాదు. ఈ సమస్యను నాన్నతో చెప్పినప్పుడు మరుసటి ఏడాది మా ఊరుకి దగ్గర్లోనే ఉండే మరొక ఊళ్లోని స్కూల్లో చేర్పిస్తానన్నారు. ఆ స్కూల్లో చుడీదార్ వేసుకునేందుకు వీలుండేదని నాన్నకు తెలుసు. మాటిచ్చినట్టే నన్ను మా నాన్న ఆ స్కూల్లో చేర్చారు.

ఈరోజు నేను రకరకాల డ్రెస్సులు వేసుకున్నా టైలర్ దగ్గరకు నన్ను తీసుకువెళ్లి కొలతలు తీసుకోమని చెప్పి సరిగ్గా కుట్టమని చెప్పి ఇచ్చిన తెల్ల రంగుమీది గులాబీపూల చుడీదార్ వేసుకున్నప్పుడు నాన్న ఎంతలా ఆనందపడ్డారో ఇప్పటికీ నాకు గుర్తే. అందుకే ఇప్పటికీ ఆ చుడీదారుని నాన్న జ్ఞాపకంగా నా బీరువాలో పదిలంగా దాచుకున్నాను. దాన్ని చూస్తున్నప్పుడల్లా నాన్న నా ముందు ప్రత్యక్షమైనట్టే అనిపిస్తుంది. నన్ను చూసి నవ్వుతున్నట్టు, భుజం తట్టి నేనున్నానురా నీకు.. అన్నట్లే అన్పిస్తుంటుంది.



నాన్న కాలేజీకి వెళ్లిందీ లేదు. అయితే నేను కాలేజీలో తొలి అడుగు వేసిన రోజు నాన్న "ఒరేయ్ నాన్నా, మన ఊళ్లో నువ్వ మొట్టమొదటగా కాలేజీలో చదువుకోవడానికి వెళ్తున్నావు. చక్కగా చదువుకో. మన ఊరికి మంచి పేరు తీసుకురావాలి" అన్నారు నన్ను చూసి.

నాన్న మాటకు తగినట్ట చదివి మంచి మార్కులతో పాసైన రోజు నాన్న చేసిన హడావుడి అంతా ఇంతా కాదు.

నేను తప్పులు చేసినప్పుడూ వాటిని సరిదిద్దుకోవడానికి దారులు చెప్పేవారు. ఒక్కొక్కప్పుడు అమ్మ కన్నా నాన్నే నన్ను కంటికి రెప్పలా చూసుకున్నారనడం అతిశయోక్తి కాదు.

ప్రతి యేటా తాను కూడబెట్టిన డబ్బులతో నా పెళ్లికోసం నగలు కొని భద్రపరచడం నాన్న అలవాటు. ఎందుకు నాన్నా అలా కొంటున్నావని అడిగితే చిన్న నవ్వు నవ్వేవారు.

నాకు పెళ్లయిన తర్వాత నా మీది నాన్న ప్రేమ మరింత ఎక్కువైంది.

దేవుళ్లందరూ నాన్న ప్రేమ ముందు ఓడిపోవలసిందే..!

నేనీ జన్మలోనే కాదు, మరెన్ని జన్మలైనా నాన్న ఋణం తీర్చలేను. అందుకే ఆనందభాష్పాలతో కృతజ్ఞతాంజలి చేస్తున్నా నాన్నకీ ఉత్తరం రాస్తూ. ఈ ఉత్తరం ఏ అడ్రెస్సుకి రాస్తావే? అని మనసు ప్రశ్నించినప్పుడు "నాన్న! కేరాఫ్ స్వర్గం" అనే రాస్తానన్నాను గర్వంగా.

మా నాన్నలాంటి మనసున్న నాన్నలందరూ ఉండేది స్వర్గంలోనేగా.

ఇట్లు
ప్రేమతో నాన్నకు
నీ గారాల ముద్దులపట్టి.

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com**




# తెలుగు వాకిలి-వెన్నెల లోగిలి

జయసూర్య

**జనం కోసం, వారి వాక్కుల కోసం, వారి స్వేచ్ఛ కోసం తన కలాన్ని, గళాన్ని ఊపిరి వున్నంతవరకు ధారపోసిన గొప్ప కవి కాళోజీ తెలుగును ఎంతో ప్రేమించారు. ఆయన దృష్టిలో బడి పలుకుల భాష, పలుకుబడుల భాషగా తెలుగు రెండు రకాలు. ప్రజాకవిగా తెలంగాణ యాసను గుండెల్లో పెట్టుకొన్న కాళోజీ యాసను ప్రేమించే భాషను, అభిమానించారు.**

"ఒక తీరుగ చూస్తే వేషం కంటే భాష రక్త మాంసాలల్లో కలిసిపోయి వుంటుంది. గ్రాంథిక భాష పుస్తకాల లోపటిది. మాండలికం భాషకు జీవధాతువు" అన్నారు కాళోజీ.

ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ, కళింగ ప్రాంతాల మాండలికాలు కలిస్తేనే కాళోజీ తెలుగు భాషగా అని నిర్వచించారు. వ్యవహారిక భాషకే మనం పట్టం కట్టాలన్న కాళోజీ, వాచకాలలో పిల్లలు చదివే అన్ని పుస్తకాలలో ఆ ప్రాంతపు మాండలిక భాషను వ్యవహారికమైన భాషనే వినియోగించాలని కోరుకున్నారు. సాహిత్యంలో భాష జీవిత వాస్తవికత నుంచి రావాలి. ఆ ప్రాంతానికి చెందిన పలుకుబడి ధోరణే భాషకు జీవం, చైతన్యం.

అందువల్ల యాసలను, మాండలికాలకు తొక్కివేయడం, చిన్నచూపు చూడటం మొదలు పెడితే భాష జీవం కోల్పోతుంది. సంస్కృతానికి అందుకే ఆ గతి పట్టింది. ఎవరికీ మాతృభాష కానిది ఎంత గొప్ప భాష అయినా మృతభాష అయ్యే ప్రమాదం వుంది. అందుకే కాళోజీ అన్య భాషా వ్యామోహాన్ని ఆంగ్లమైనా, సంస్కృతమైనా తీవ్రంగా నిరసించారు. **"అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా"** అంటూ చురకలు వేసారు.

మాతృభాషలో మాట్లాడలేకపోవడం, రాయలేకపోవడం ఇప్పుడిప్పుడు వింటున్నాం. స్వదేశీ భాష మాట్లాడలేకపోవడం, రాయలేకపోవడం సిగ్గుపడాల్సిన విషయం. ఏ భాషలో అయినా పుస్తకాలలో భాషకు మాట్లాడే వాడుక భాషకు తేడా ఉంటుంది. ఆంగ్ల పండితులు ఎప్పటికప్పుడు గ్రంథాలలో కూడా వాడుక భాషను అనుసరించి సరిచేసుకొంటూ వచ్చారు. కానీ తెలుగు కవులు పద్య కావ్యాలలోని ప్రాచీనతను పదాలను గొప్పగా ఎంచుకొని శబ్దాడంబరం ఆశ్రయించారు.

"తెలుగు సాహిత్యంలో ఒకప్పుడు ఎక్కువగా పద్య కావ్యాలే రావటం వలన ప్రజలు మాట్లాడుకొనే భాషకు, పుస్తక భాషకు పెద్ద అఖాతం ఏర్పడింది' అన్నారు డిసెంటు పత్రంలో గురజాడ.

ఇంటిదగ్గర చదువుకోవటానికి, బడులలో చదివించటానికి తెలుగు చాలా కాలం ఉపయోగపడలేదు. మనం మాట్లాడేటప్పుడు కలిగిన అనుభూతిలోనే పాశ్చాత్యులు తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని ప్రశంసించారు. పాఠశాలలో తెలుగు బోధించే ఉపాధ్యాయులు, ఆధునిక కవులు



రచయితలు కొంతవరకు ఒక ఉద్యమంగా తెలుగును సులభతరం చేసారు. అందువలన గత శతాబ్దిగా తెలుగు జనాదరణ పొందుతోంది. కానీ ప్రస్తుత 21వ శతాబ్ద కాలగతిలో సామాజిక అవసరాలు శృతి మించడంతో మాతృభాషాభిమానం కొరవడుతోంది. తెలుగులో విద్యాబోధన, ఆంగ్లాని కన్నా క్లిష్టమనే భావన రూపుమాపవలసిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యాధికులపై ఉంది. విద్యారంగంలో ఆంగ్లం స్థానంలో దేశ భాషలను బోధనా భాషలుగా ప్రవేశపెట్టాలంటే మరింతగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయుక్తం చేసుకోగల పద సముదాయం సమకూర్చాలి. ప్రస్తుత విద్యార్థుల విద్యావసరాలకు అనుగుణంగా, రచయితలు పాఠ్య పుస్తకాలు రాసేటట్టుగా ప్రభుత్వం భాషాభివృద్ధికి కంకణం కట్టుకోవాలి. ఆబాలగోపాలం, తెలుగు మాట్లాడడానికి, వినడానికి ఆసక్తి కలిగించే పదాలు, సంకీర్తనలు వేలకొలది ఉన్నాయి. భక్తి, శృంగారం, జ్ఞానం, హాస్యం ద్వారా భాషా ప్రచారం తెలుగు ఏకతను కాపాడుతుంది.

తెలుగుకు వ్యవహారికోదమ్యమంలో భాగంగా పత్రికలు ఎనలేని సేవలందిస్తున్నాయి. దురదృష్టవశాత్తు వ్యాపార రంగంలోని పత్రికా రంగం, టి.వి. ప్రసార మాధ్యమాల పోటీ తట్టుకోలేకపోతోంది. ఎలక్ట్రానిక్ మాధ్యమంలో వార్తలు, వ్యాఖ్యలు, సీరియల్స్, ఎన్నో వివిధ ప్రక్రియలలో ఛానల్స్, వీడియోలు, ఫేస్‌బుక్‌లు అధునాతనంగా తెలుగువాణి వినపడుతోంది, కనపడుతోంది. అనువదింపబడుతోంది. అవన్నీ మాతృభాష సుసంపన్నత దృష్ట్యా ఆహ్వానించదగ్గ పరిణామాలే. వాటితో పాటు తెలుగునాట మారుతున్న సంస్కృతి కారణంగా ఆచార వ్యవహారాలలో తెలుగు భాష మసకబారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవభాషగా ఉనికి కోల్పోకుండా దేశ జన బాహుళ్యంలో అధిక సంఖ్యాకులు ఆదరించే, అభిమానించే భాషగా పూర్వ వైభవంతో మన మాతృభాష మరింతగా తెలుగు వెలుగులు విరజిమ్మాలి. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ అయినా "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" అయినా తెలుగుతల్లి విశ్వదీప్తి, తెలుగు వాకిలి వెన్నెల వెలుగులు ప్రపంచ మంతటా ప్రసరింపచేయాలి.

సింగిల్ పేజీ కథ

# మోక్షం

తాళ్ళూరి లక్ష్మి

**కోనసీమలో అదో చిన్న గ్రామం. ఆ గ్రామంలో గోదారి ఒడ్డునే ఒక చిన్న శివాలయం. ఎంతో మహిమ గల దేవాలయం అని ప్రసిద్ధి చెందటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు వచ్చి ఆ దేవాలయాన్ని సందర్శించుకునేవారు.**

చుట్టూతా సంపెంగ, మోదుగ, పారిజాతం, బిల్వం, రావి, మర్రిచెట్లతో ఆ దేవాలయం ఎంతో ఆకర్షణీయంగా, ప్రశాంతంగా ఉండేది. ప్రొద్దుట, సాయంత్రాలు పక్షుల కిల కిలా రావాలతో ఎంతో సందడిగా, వీనుల విందుగా ఉండేది.



ఆ ఆలయం పూజారి ఎప్పటి నుండి ఆ దేవాలయంలో పూజలు చేస్తున్నాడన్న విషయం ఎవరికీ తెలియదు. శివాలయం అనగానే అందరికీ ఆ పూజారి గుర్తుకు వచ్చేవాడు. అలాగే ఆ పూజారి మాట చెప్తే అందరికీ శివాలయం గుర్తుకు వచ్చేది.

అంతగా మమైక్యం అయిపోయాడు ఆ పూజారి ఆ శివాలయంతో. అలాగే అతని అసలు పేరు కూడా ఎవరికీ తెలియదు. అందరూ ఆప్యాయంగా శివదాసుగారు అని పిలిచేవారు.

పూజారి కాక ఆ ఆలయంతో మమైక్యమైన మరో వ్యక్తి గౌరమ్మ. ఆవిడ గుడి ప్రాంగణంలోనే ఒక చిన్న రేకుల గదిలో నివసించేది. ఎప్పుడు లేచేదో ఏమో.. పొద్దుటే దేవాలయం తలుపులు తెరుచుకోకముందే గుడి ప్రాంగణమంతా పరిశుభ్రం చేసి, నీళ్లతో కడిగి, కళ్లాపి జల్లి, ముగ్గులు వేసి భక్తుల మనసు రంజించేలా దేవాలయాన్ని అలంకరించేది. అలాగే ప్రతిరోజూ పూజాసామాగ్రినంతా గోదావరి నీటితో శుభ్రంగా తోమి, అవి ఎప్పుడూ తళ తళా మెరిసిపోయేటట్లు చూసేది.

కాలగమనంలో పూజారి, గౌరమ్మ ఇద్దరూ వృద్ధాప్య దశను చేరుకుని ఒక ఒక రోజున శివసాయుజ్యం చెందారు.

దేవదూతలు వాళ్లిద్దరినీ తీసుకుని వెళ్లి సమవర్తి ముందు నిలబెట్టారు. సమవర్తి ఆదేశానుసారం వారి కర్మఫలం పరీక్షించిన చిత్రగుప్తులవారు "గౌరమ్మను నేరుగా అమరపురికి తీసుకెళ్లమని; పూజారిని ఒక ఘడియపాటు నరక కూపంలో ఉంచి తదుపరి అమరపురికి తీసుకెళ్లమని" చెప్పారు.

వారి నిర్ణయానికి ఆశ్చర్యపోయిన పూజారి "స్వామీ! ఇదేమి న్యాయం? జీవితాంతం శివసేవలో మునిగిన నాకెందుకు ఈ శిక్ష?" అని చిత్రగుప్తుల వారిని ప్రశ్నించాడు.

దానికి చిత్రగుప్తులవారు "నాయనా శివదాసూ, శివపూజలో ఒకనాడు చేసిన ఒక చిన్న తప్పిదం వలన పరమభక్తుడవైన నువ్వు ఈ శిక్షను అనుభవించవలసి వస్తోంది. ఈ గౌరమ్మ అన్ని పనులు శివధ్యానంతో చేసి అన్నీ శివార్పణ చేసేది. అందుకే మోక్షాన్ని సంపాదించుకోగలిగింది" అన్నారు.

"నేను చేసిన ఆ తప్పిదమేమిటో సెలవియ్యండి స్వామి" అని పూజారి వేడుకోగా-

చిత్రగుప్తులవారు "ఒకనాడు నువ్వు ఒక భక్తుడిచేత శివాభిషేకం చేయిస్తున్న తరుణంలో మీ గ్రామ పెద్ద దేవాలయానికి విచ్చేయగానే ఆయన ఆయన పూజకు జాప్యం కలగకూడదని నువ్వు చేయిస్తున్న అభిషేకాన్ని అసంపూర్ణంగా ముగించేసావు. ఆ కర్మఫలమే ప్రస్తుతం నువ్వు అనుభవించాల్సిన శిక్ష" అన్నారు.

చిత్రగుప్తులవారి వివరణకు చలించిపోయిన పూజారి "స్వామీ, నా వల్ల ఘోర తప్పిదం జరిగిపోయింది. నేను క్షమార్హుడను కాను. మీ శిక్ష ఆనందంగా అనుభవిస్తాను" అని-

"అమ్మా గౌరమ్మా! నువ్వెంత ధన్యురాలివమ్మా. చేసిన ప్రతి పనిలోనూ మనసా, వాచా, కర్మణా ఆ ముక్కంటినే దర్శించుకుంటూ పుణ్యగతిని పొందగలిగావు. నీకు నా నమః సుమాంజలులు" అని గౌరమ్మకి నమస్కరించాడు.

దేవదూతలు వారిద్దరినీ తీసుకుని వెళ్లడానికి సంసిద్ధులు కాగా, చిత్రగుప్తులవారు గౌరవమ్మతో సహా పూజారిని కూడా నేరుగా అమరపురికి తీసుకువెళ్లమని చెప్పారు.

"ఈ మార్పెందుకు స్వామీ?" అని దేవదూతలు ప్రశ్నించగా-

చిత్రగుప్తులవారు "ఎప్పుడైతే శివదాసు తన తప్పు తెలుసుకుని ఒక శివ భక్తురాలికి మనస్ఫూర్తిగా నమస్కరించాడో ఆ క్షణమే అతను పాపరహితుడై మోక్షానికి అర్హుడయ్యాడు".

ఆనంద పారవశ్యంతో వారికి అంజలి ఘటించాడు శివదాసు.

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com

# ప్రాచీన మసీదులు

షేక్ అబ్దుల్ హాకీం జాని

**చైనాలో అనేక మసీదులు, బౌద్ధ ఆలయాలు ప్రాచీన కాలం నుండి విరాజిల్లుతున్నాయి. అక్కడ సుమారు రెండున్నర కోట్ల మంది ముస్లింలు జీవిస్తున్నారు. అత్యధిక ముస్లిం జనాభా చైనాలోని జిన్‌జియాంగ్, లియాఖియావో ప్రాంతాలలో నివసిస్తుండగా ఉయ్ఘుర్, నింగ్షియా, గన్సు, కింగ్‌హై ప్రాంతాలలో తక్కువ జనాభా నివసిస్తుంటారు.**

చరిత్రలోని రాతపూర్వక రికార్డులు, సామ్రాజ్య శాసనాలను పరిశీలిస్తే చైనాలోని ఇస్లామిక్ కమ్యూనిటీలు అలనాటి చక్రవర్తుల అనుగ్రహాన్ని, ఆదరాభిమానాలను పొందినట్లు స్పష్టమైంది. ముఖ్యంగా టాంగ్ (క్రీ.శ.618-907), యువాన్ (1271-1368), మింగ్(1368-1644), క్వింగ్(1644-1912) రాజవంశాలు. చక్రవర్తుల విషయానికొస్తే సామ్రాజ్య భూభాగాల్లోని విభిన్న ప్రజల మధ్య సామరస్య పూర్వకమైన, శాంతియుత సంబంధాలను పెంపొందించే నైతికత కారణంగా ఇస్లాంను సామ్రాజ్య న్యాయస్థానం అనుకూలంగా చూసింది. ఈ వివాదాలను పక్కన పెడితే అనేక సాకులు చెప్పి వేలాది మసీదులను కూల్చినప్పటికీ ఇంకా ఇప్పటికీ అనేక వేల మసీదులు చైనాలో సుభిక్షంగా వున్నాయి. ప్రాచీన చరిత్రకు అద్దం పట్టే అటువంటి కొన్ని మసీదుల గురించి తెలుసుకుందాం..

## హువైషంగ్ మస్జిద్

చైనాలోని పురాతన మసీదుల్లో ఒకటి హువైషంగ్ మసీదు. దీనికి దాదాపు 1300 సంవత్సరాల చరిత్ర ఉంది. హువై చైనాలో హుఈ అనే ముస్లిం సముదాయం 8వ శతాబ్దంలో టాంగ్ రాజవంశస్థుల కాలంలో అడుగు పెట్టారు. మరో సముదాయం షింగ్‌జియాంగ్‌లో నివసిస్తుంటారు. చైనా సంప్రదాయ రీతుల్లో నిర్మించిన సుప్రసిద్ధ మస్జిద్ హువైషంగ్ మస్జిద్ చైనాలోని గ్యాంగ్‌జౌ ప్రాంతంలో నెలకొని వుంది. ఇది చైనాలో తొలి మసీదు అని చరిత్ర చెబుతోంది. చైనాలోనే ఇది అతి ప్రాచీన మసీదు. దీని గోడలపై దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆయాత్‌లు లిఖించి ఉంటాయి. చైనాలోని అతి ముఖ్యమైన మస్జిద్‌లలో ఇది ఒకటి. మహ్మద్ ప్రవక్త జ్ఞాపకార్థం హువైషంగ్ మస్జిద్‌ను నిర్మించారు. వందలాది ఏళ్ల క్రితం దీన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది. ఆ కారణంగా దీన్ని ప్రపంచంలోని ప్రాచీన మస్జిద్‌ల జాబితాలో చేర్చారు. దీనిని లైట్‌హౌస్ మసీదు, గ్రేట్ మసీదు ఆఫ్ కాంటన్ అని కూడా పిలుస్తారు. ప్రపంచంలోని పురాతన మసీదులలో ఇది ఒకటి. దీనికి 36 మీటర్ల ఎత్తులో మీనార్లు నిర్మించారు. మీనారు పైభాగంలో సూదిమొనలా రూపొందించారు. ఇంత ఎత్తు ఉండటం వల్ల సముద్రంలో ప్రయాణం చేసేవారికి ఇదొక లైట్ హౌస్‌లా కనిపిస్తుంది. అందువల్ల దీన్ని లైట్ హౌస్ మసీదు అని కూడా పిలుస్తారు. చైనాలోని ప్రముఖ పది పర్యాటక ప్రదేశాలలో ఈ మసీదుకు స్థానం లభించింది.



## ది గ్రేట్ మాస్క్ ఆఫ్ జియాన్

ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రాచీన మస్జిద్‌లలో ఒకటి చైనాలోని ది గ్రేట్ మాస్క్ ఆఫ్ జియాన్. చైనాలోని షాంగ్‌జీ ప్రాంతంలో జియాన్ అనే చిన్న పట్టణంలో ఈ మస్జిద్ నెలకొని ఉంది. ఈ మసీదును అనేకసార్లు పునర్నిర్మించారు. క్రీ.శ.618-907 ప్రాంతంలో చైనాను పాలించిన టంగ్ వంశస్తులు ఈ గ్రేట్ మాస్క్‌ను క్రీ.శ.742లో నిర్మించారు. అనంతరం 1368-1644 మధ్య కాలంలో చైనాను పాలించిన మింగ్ వంశస్తులు, వీరి తరువాత 1644-1912 వరకు పాలించిన క్వింగ్ వంశస్తులు గ్రేట్ మాస్క్‌ను అభివృద్ధి పరచారు. జియాంగ్ పట్టణంలో 16 వేలమంది ముస్లింలు నివసిస్తున్నారు. గ్రేట్ మాస్క్‌లో లోపలి భాగంలో ఒకేసారి రెండు వేలమంది నమాజ్ చదువుకోవడానికి సౌకర్యంగా ఉంటుంది. లోపలి భాగంలో నమాజ్ చదువుకునే వారికోసం అందమైన కార్పెట్లు పరచి వుంటాయి. అరబిక్, ఇస్లామిక్, చైనా శిల్పకళ మేళవించి నిర్మించిన ఈ అద్భుత నిర్మాణాన్ని తిలకించడానికి ప్రతిరోజూ దేశ విదేశాల నుండి పర్యాటకులు వస్తుంటారు. దీని పైకప్పు చైనా శిల్పకళ ఉట్టిపడుతూ శిల్పకళారీతులు కనిపిస్తాయి.





గోడలపై చైనా, అరబిక్ లిపిలో ఖుర్ఆన్ లిఖించబడి ఉంటుంది. రాత్రివేళలో మస్జిద్ విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతుంది. మస్జిద్ చుట్టుపక్కల పచ్చటి చెట్లతో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. మస్జిద్ ప్రాంగణంలో దీని చరిత్రను తెలియజేసే సమాచారం పర్యాటకుల కోసం లిఖించారు. ఇప్పుడు గ్రేట్ మాస్క్ ఇస్లామిక్ ఆధ్యాత్మిక కేంద్రంగానే కాక గొప్ప పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుంది.

## బీజింగ్‌లో చైనా శిల్పరీతుల న్యూజీ మస్జిద్

చైనా శిల్పకళతో గంభీరంగా కనిపించే సుందర మస్జిద్ న్యూజీ. చారిత్రాత్మకమైన ఈ మసీదు చైనా రాజధాని బీజింగ్‌లో నెలకొని వుంది. ఈ మస్జిద్ 2010 నుండి జిన్‌హూ జిల్లా పరిధిలోకి వచ్చింది. మొత్తం 10 వేల చదరపు మీటర్ల పరిధిలో దీన్ని నిర్మించారు. ఇస్లామిక్-చైనా శిల్పరీతులు దీని నిర్మాణంలో కనిపిస్తాయి. బయటవైపు చైనా శిల్పకళ, లోపలి భాగంలో చైనా-ఇస్లామిక్ శిల్పరీతులు కనిపిస్తాయి. నమాజ్ చదివే ప్రధాన హాలు 600 చదరపు మీటర్లు ఉంటుంది. ఇందులో ఒకేసారి వెయ్యి మంది నమాజ్ చదవడానికి అనువైన స్థలం కలిగి వుంది. క్రీ.శ.916-1125 మధ్య కాలంలో చైనాను పాలించిన లియో రాజవంశీయులు పాలించారు. వారి కాలంలో క్రీ.శ.996లో చైనా సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే న్యూజీ మస్జిద్‌ను చెక్కతో నిర్మించారు. స్థానిక ముస్లింలు చైనా శిల్పకళకు అద్దంపట్టే విధంగా దీని నిర్మాణానికి పూనుకున్నారు. అరబ్బిక్ కాలీయోగ్రాఫీ అనేది ఇందులో ఉపయోగించలేదు. చైనా లిపి ఈ మస్జిద్ గోడలపై కనిపిస్తుంది. నజీరుద్దీన్ అనే ఇమామ్ కుమారుడు ఈ మస్జిద్‌ను డిజైన్ చేశారు. క్రీ.శ.1215లో చెంఘీస్‌ఖాన్ ఈ మస్జిద్‌ను కూల్చేశాడు. అయితే క్రీ.శ.1443లో దీన్ని మింగ్ రాజవంశీకులు తిరిగి నిర్మించారు. అనంతరం క్రీ.శ.1696లో క్వింగ్ రాజవంశీకులు విస్తృత స్థాయిలో న్యూజీ మస్జిద్‌ను అభివృద్ధి పరిచారు. ఈ మసీదులో 300 సంవత్సరాల నాటి దివ్య ఖురాన్ గ్రంథం ఉంది.

## డోంగువాన్ మస్జిద్

సుమారు 600 సంవత్సరాలకు పైబడి చరిత్ర కలిగిన డోంగువాన్ మసీదు వాయువ్య చైనాలోని క్వింగై ప్రావెన్స్‌లో నెలకొని ఉంది. ఒకేసారి అయిదువేల మంది ఈ మసీదులో నమాజు చదవడానికి అనువుగా నిర్మించారు. మింగ్ రాజవంశ చక్రవర్తి హాంగ్వు కాలంలో క్రీ.శ.1380లో దీన్ని నిర్మించారు. పది ఎకరాల్లో చైనా, ఇస్లామిక్ సంప్రదాయాలను మేళవించి దీన్ని నిర్మించారు. చైనాలోనే అతి పెద్ద మదర్సాగా పేర్కొన్నది ఈ మసీదులో ఉంది. ఇక్కడ వేలాది అపురూప గ్రంథాలతో కూడిన గ్రంథాలయం ఉంది. క్వింగ్ రాజవంశ పాలనా కాలంలో ఈ మసీదు ధ్వంసమైంది. ఆ తరువాత పలుమార్లు కూల్చివేతకు గురైంది. 1914లో నూతన నిర్మాణ శైలిలో దీన్ని పునర్నిర్మించారు.

## షాదియాన్ గ్రాండ్ మస్జిద్

ఈ మసీదును 1684లో నిర్మించారు. పదివేల మంది ఒకేసారి నమాజు చేయవచ్చు. దీనిని నిర్మించిన నాటి నుండి 2010 వరకు ఈ మసీదు పలుమార్లు పునర్నిర్మాణం గావించి నేటి ఆధునిక రూపాన్నిచ్చారు. మధ్యలో అతిపెద్ద డోమ్, నలుమూలలా నాలుగు ఎత్తైన మీనార్లు నిర్మించారు.



తూర్పు ఆసియాలో ఇది అతి పెద్ద మసీదుగా గుర్తింపు పొందింది. చైనాలోని యునాన్ ప్రాంతంలో ఈ మసీదును స్థానిక ముస్లింలు నిర్మించారు. యునాన్ ప్రాంతంలో లక్షలాది మంది ముస్లింలు నివసిస్తున్నారు. యునాన్ తొలి గవర్నర్‌గా ముస్లిం వ్యక్తి షంషుద్దీన్ ఉమర్ బుఖారీ సమర్థవంతంగా పనిచేశారు. సౌదీ అరేబియాలోని మస్జిద్-ఏ-సబవీ నమూనాలో షాదియాన్ గ్రాండ్ మసీదును చైనాలో నిర్మించారు. ✦



# గుర్తింపుకోసం

సమాజంలో ప్రతి వ్యక్తీ తనకు ఒక గుర్తింపు వుండాలని కోరుకుంటారు. అందరికీ తను తెల్సుండాలి.. తనకు ఒక విలువ వుండాలి. సినిమా తారలకైనా, రాజకీయ నాయకులకైనా, కళాకారులకైనా, పది మందీ తమను గుర్తించాలనీ, మెచ్చుకోవాలనీ అనుకుంటారు.

ఈ విధమైన ఆలోచన సామాన్యులకు సైతం వారి పరిధిలో వారికి ఉంటుంది.



ఇది ఇలా వుంచితే మొదటిసారి ఒక వ్యక్తి మరో వ్యక్తితో కలిసినప్పుడు కలిగే అభిప్రాయం చాలా విలువైనది. ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ద బెస్ట్ ఇంప్రెషన్ అంటారు. మొదటిసారి ఒక వ్యక్తి మరొక వ్యక్తిని కలిసినప్పుడు ఏర్పడే అభిప్రాయం, ఆ తర్వాత వారి మధ్యన సాగే ప్రయాణంలో ఒక కీలక పాత్ర పోషిస్తుంది.

ఒక వ్యక్తి గురించిన అభిప్రాయం ఏర్పడాలంటే చాలా అంశాలు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. మనిషి రూపం, ధరించిన దుస్తులూ, నడకతీరు, వారు మాట్లాడే తీరు సైతం ఒక ప్రత్యేకతను ఏర్పరుస్తాయి. వారి విద్యార్హతలు, ప్రవర్తన, నైపుణ్యాలు ఆ ప్రత్యేకతను మరింత పెంచుతాయి. ఈ ఫస్ట్ ఇంప్రెషన్ ఏర్పడటానికి అట్టే సమయం తీసుకోరు. ఒక్క క్షణంలో ఏర్పడిపోతాయి.

తొలి అభిప్రాయానికి ఎంతో ప్రాధాన్యం వుంది. చాలా అరుదుగా ఈ ఫస్ట్ ఇంప్రెషన్‌ను మార్చుకోవడం జరుగుతుంది.

ముఖ్యంగా మనం ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు ఈ ఫస్ట్ ఇంప్రెషన్ ముఖ్య పాత్ర వహిస్తుంది. పాత రోజుల్లో ఆవలిస్తే పేగులు లెక్కపెట్టగల సమర్థులుండేవారట. మనిషిని ఒకసారి చూసి అతనేమిటో అంచనా వేయగలరట వారు. అంతటి అనుభవశాలురు వారు. ఎవ్వరితో మాట్లాడకుండా ఎవ్వరినీ కలవకుండా, కనీసం ఒక చిరునవ్వు కూడా నవ్వకుండా కూర్చున్న వారిని చూస్తే ఎవ్వరికైనా ఏమనిపిస్తుంది? కానీ అనుభవజ్ఞులైనవారు, అతనికి ఏమాత్రం ఆత్మస్థైర్యం వుంది, స్థిరత్వం వుందా లేదా, అతను నమ్మదగిన వ్యక్తా, మోసగాడా, కిలాడీనా? అనే విషయాలు ఇట్టే కనిపెట్టేస్తారట. అసలు నలుగురిలో నచ్చాలంటే మనం ఎలా వుండాలి? అన్న విషయం ఆలోచిస్తే మన డ్రెస్ సౌకర్యంగా, మనకు అందాన్ని చేకూర్చే విధంగా వుండాలి. సందర్భానికి తగినట్లుగా వుండాలి. మనం కూర్చునే విధానం, నిలబడే విధానం, కరచాలనం చేసే విధానమూ, నడిచే విధానమూ మన ప్రత్యేకతను సూచిస్తాయి. మాటలు మరీ నెమ్మదిగా లేదా అరచినట్లుగానూ వుండకూడదు. స్పష్టంగా మాట్లాడాలి. సూటిగా వుండాలి. భాష మీద దృష్టి పెట్టాలి. చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో గమనిస్తూ వుండాలి. ఎదుటివారు ఏమి చెబుతున్నారో శ్రద్ధగా వినాలి. వారివైపు చూస్తూ మాట్లాడాలి. అసందర్భంగా మాట్లాడరాదు.

ఇలా వివిధ విషయాలను దృష్టిలో వుంచుకుని ఏర్పర్చుకున్న అభిప్రాయం కలకాలం వుండేలా చూసుకోవాలి. మీ ప్రత్యేకతకు భంగం కలిగే విధంగా ఉండకూడదు. ఎందుకంటే సంఘంలో, మానవ సంబంధాల్లో అడుగడుగునా మీ గొప్పతనానికి ఒక విలువ వుంది. దాన్ని సదా రక్షించుకుంటూ అడుగులు వేయాలి.

# వివేకంతో ఆలోచించాలి!

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

ప్రేమ, అభిమానం అనేవి అదుపులో వుంచుకోవాలి అని పెద్దలు చెప్తుంటారు. ఏదైనా హద్దు మీరటం మంచిది కాదంటారు. దేన్నయినా తగిన మోతాదులో వాడాల్సి ఉంటుంది.

ఒక ఊళ్లో ఒక మంచి కరుణామయుడు ఉన్నాడు.

ఒకసారి అతను నది ఒడ్డున నడుచుకుంటూ వెళ్తున్నాడు. అంతలో అతనికి ఒక చేప ఒడ్డున పడి కొట్టుకుంటూ ఇతని కంట పడింది. వెంటనే దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. తన జేబులో వేసుకున్నాడు. అది ఇంకా కొట్టుకుంటూనే వుంది. ఇంతలో ఆ పక్కనే తనకు ఇష్టమైన కాఫీ షాపు కనిపించింది. వెంటనే ఒక కాఫీ బెస్ట్‌గా చేసి ఇవ్వమన్నాడు. కాఫీ వాసన చూసి అబ్బో.. బ్రహ్మాండం అనుకున్నాడు.



గబా గబా ఇంటికి చేరుకుని తనకు ఇష్టమైన కాఫీని చేప నోట్లో పోసాడు. తనూ కాసింత కాఫీ తాగి కాఫీ ఎంత బాగుందో! ఎంజాయ్ అంటూ చేపను ప్రోత్సహించాడు. పాపం... మనవాడికి తెలియదు.. ప్రేమా, పిచ్చీ ఒకటేనంటారు. ఆ విధంగానే జరిగింది. వేడి కాఫీ నోట్లో పోయగానే చేప చనిపోయింది.

కాస్త లోతుగా ఆలోచించి చూస్తే అతను ఎంత అమాయకుడో అర్థం అవుతుంది. నదిఒడ్డున దొరికిన చేపను వెంటనే పక్కనే వున్న నదిలో వేస్తే సరిపోయేది. అలా కాకుండా అతను తన వెంట జాగ్రత్తగా తీసుకువెళ్లాడు. చేప చలికి వణికుతోందనుకుని వేడి వేడి కాఫీ పోసాడు. చేపలు ఎక్కడైనా కాఫీ తాగుతాయా? అన్న ఆలోచన రాలేదు అతనికి. అందుకే ఏ పని చేయాలన్నా కాస్త విజ్ఞతతో ఆలోచించి చేయాలని పెద్దలు, అనుభజ్ఞులు చెప్తుంటారు. గుడ్డి ప్రేమతో మనమే మన చేతులారా ఎవ్వరికీ హాని తలపెట్టకూడదు.

# వంట ఏ దిశలో చేయాలి?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




పి.కార్తికేయ – పుత్తూరు

**ప్రశ్న: వంట ఏ దిశలో చేయాలి?**

వంట ఆగ్నేయంలో చేయాలన్నది వాస్తు నియమం. అయితే పొయ్యిని పూర్తిగా ఆగ్నేయ మూలలో తూర్పు, దక్షిణ గోడలకు ఆనించి వంట చేయడం సరైన ఫలితాలనివ్వదు. పొయ్యి (స్టవ్) ఆగ్నేయ మూలన తూర్పు గోడకు తగలకుండా వుండాలి. దక్షిణ గోడను ఆనుకొని వున్నా పరవాలేదు. లేదా తూర్పు దక్షిణ గోడలకు ఆనుకొని లేకున్నా పర్వాలేదు. ఆగ్నేయ మూల ఒక చదరపు అడుగు స్థలాన్ని ఖాళీగా దిలేసి తూర్పుగోడను



ఆనకుండా స్టవ్ అమర్చి తూర్పుకు అభిముఖంగా నిలబడిగానీ, కూర్చొనిగానీ వంట చేయాలి. తూర్పు గోడలకి గూడు లాంటి ఆ గూడులో స్టవ్ పెట్టి వంట చేయడం కూడా సరైన పద్ధతి కాదు.

## ఈశాన్యంలో నీళ్లు ఉండాలా?

సి.మణిమాల – పిఠాపురం

**ప్రశ్న: ఈశాన్యంలో తప్పనిసరిగా నీళ్లు వుండాలా?**

**జవాబు:** ఈశాన్యంలో నీళ్లు ఉండాలని చాలామంది అక్కడ నీళ్లు పెట్టే ప్రయత్నం చేస్తారు. అక్కడ బోర్‌వెల్‌గానీ, పంపుగానీ, బావిగానీ లేకపోతే అవి ఏర్పాటు చేసుకునే అవకాశం లేకపోతే డ్రమ్ముల్లో నీళ్లు నింపి అక్కడ పెడుతుంటారు. అది మంచి ఫలితాలనివ్వకపోగా చెడు ఫలితాలనిస్తుంది. ఈశాన్య మూల భూమి లెవెలు కంటే తక్కువ లెవెల్లో నీటిని పట్టి వుంచాలి. అంటే ఆ సంప్ లాంటిది కట్టి నీళ్లని స్టోర్ చేయాలి. కానీ భూమి పైన డ్రమ్ముల్లో నీళ్లను పట్టి పెట్టి ఆ మూల భారం అధికం చేయడం వాస్తు నియమానికి విరుద్ధమైన పని అవుతుంది.

## ఏ రంగు లైట్ మంచిది?

జి.కార్తిక్ – నారాయణఖేడ్

**ప్రశ్న: బెడ్ రూమ్‌లో లైట్లు ఏ కలర్‌లో వుండాలి?**

**జవాబు:** బెడ్ రూమ్ లైట్ల విషయంలో జాగ్రత్తలు వహించడం చాలా మంచిది. ఎరుపు రంగు బెడ్ లైట్ సర్వదా శ్రేయస్కరం. నీలం, పసుపు, ఆకుపచ్చ రంగు వెలుతురు అందరి ఆరోగ్యానికి సరిపడదు. సరిపడని వెలుతురులో పడుకోవడం వల్ల చెడు స్వప్నాలు రావడం, చర్మం పొడారిపోయినట్లు కనిపించడం మనిషి బరువు కోల్పోతూ అనారోగ్యం పాలవడం, మానసిక ఒత్తిడులకు గురి కావడం జరుగుతూ ఉంటుంది. అందువల్ల ఏ రంగు వెలుతురు సరిపోతుందో గమనించి అదే రంగు బల్బు వాడాలి. లేదా మిల్క్ బల్బ్ వాడుకోవచ్చు.

## సీలింగ్ డిజైన్ ఎలా ఉండాలి?

ఎస్.కార్తిక – గుంటూరు

**ప్రశ్న: సీలింగ్ డిజైన్ ఎలా ఉండాలి?**

**జవాబు:** సీలింగ్స్ డిజైన్స్‌లో సీలింగ్ నుండి కిందికి ఒక అంగుళం మేర బొడిపెలుగానీ, సూదుల్లాగానీ పొడుచుకువచ్చేలా వచ్చేలా సీలింగ్ అలంకరించడం ఆ ఇంట్లో నివసించే వాళ్లను మానసిక ఆందోళనకు గురి చేస్తుందనడంలో సందేహం లేదు. సీలింగ్ నున్నగా ఉండాలి.

## ఫ్లాట్స్‌కు వాస్తు వర్తిస్తుందా?

ఎస్.వనిత – కాకినాడ

**ప్రశ్న: ముప్ఫై నలభై ఫ్లాట్స్ వున్న దగ్గర వాస్తు వర్తించని కొందరు చెప్పారు. ఇల్లు ఫస్ట్ ఫ్లోర్‌లో వుంది కనుక వాస్తు వర్తించదని మరికొందరు అంటున్నారు. మా సందేహం తీర్చగలరు.**

**జవాబు:** ఫ్లాట్స్‌కి కూడా వాస్తు ఉంటుంది. ఆ కాంప్లెక్స్ కట్టిన స్థలాన్ని బట్టి, పరిసరాలనుబట్టి మొత్తం కాంప్లెక్స్‌కు వాస్తు వర్తిస్తుంది. ఆ తర్వాత ఒక్కో ఫ్లాట్ నిర్మాణాన్ని బట్టి వాస్తు ప్రభావం హెచ్చు, తగ్గులు ఉంటుంది. మీ ఇంటికి ఈశాన్యంలో వంటగది, తూర్పున లెట్రిన్ వుండటం వాస్తుదోషం అవుతుంది. వంటగది ఆగ్నేయానికి, లెట్రిన్ దక్షిణానికి వున్న రెండు బెడ్ రూమ్స్ మధ్యకి మార్చి ఆ దోషాన్ని సవరించుకోండి.

## ఇంట్లో దోషాలున్నాయా?

కె.మంజునాథ్ – హిందూపురం

**ప్రశ్న: ఇంటిని పూర్తిగా మార్చి మళ్లీ కట్టే శక్తి లేదు. ఇంట్లోని లోటుపాట్లు తెలియజేసి, చేయాల్సిన మార్పులు చెప్పగలరు. మా ఇంటి నీరు కొంత పశ్చిమం పెద్ద ద్వారం గుండా, కొంత నీరు తూర్పు గుండా పోతున్నాయి. ఇంటి స్థలం ఈశాన్యం, ఆగ్నేయం వాయవ్యం కన్నా నైరుతి కొద్దిగా వంపుగా వున్నది. మా ఇంట్లో మా నాన్నగారికి పెద్ద కొడుకును. నాకు, చిన్న పిల్లలకు మంచిగా అనిపించడం లేదు. ఇంట్లో దోషాలు ఏమైనా వున్నాయేమోనని అనుమానంగా వుంది. మా ప్లాను చూసి సలహా చెప్పగలరు.**

**జవాబు:** మీకు డబ్బులు రావటం, పోవటం కూడా అతివృష్టి, అనావృష్టిలా ఉంటుంది. నైరుతి మూలను మూలమట్టానికి సరిచేసుకుని దక్షిణం వైపు మిగిలే స్థలాన్ని వదిలివేయాల్సి ఉంటుంది. ఇంటి స్థల గర్భంలో నీళ్ల హౌజ్(సంప్) వుండకూడదు. దాన్ని ఉత్తరం లేదా తూర్పు సరిహద్దుకి దగ్గరగా మార్చుకోవాలి. వర్షంనీళ్ల ఈశాన్యంవైపు నేలమట్టాన్ని వాస్తు ప్రకారం సవరించండి. వాయవ్య మూలలో కట్టిన పశువుల కొట్టాన్ని పూర్తిగా నిర్మూలించండి. ఇంట్లో నడక ఉచ్ఛస్థానంలో అంటే తూర్పు ఈశాన్యం నుండి పశ్చిమ వాయవ్యం వైపు సాగేలా తలుపులు మార్చి వాటికెదురుగా కాంపౌండ్ గోడకు గేటు అమర్చండి. అలాగే పశ్చిమ వాయవ్య కాంపౌండుకు కూడా గేటు అమర్చండి. మీకు తప్పకుండా మంచి ఫలితాలు కనిపిస్తాయి.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



దీర్ఘాలోచనలు ఫలిస్తాయి. దూరదృష్టితో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. అవసరమైన సమయంలో మీకు అందించవలసిన సలహాలు, సహాయం అందకపోవచ్చు. రాబోయే రోజుల్లో ప్రయోజనాలు అందుకోవడానికి సిద్ధంగా వుండే వ్యక్తులు తారసపడతారు. నూతన వ్యాపారాల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. వ్యాపారులకు నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి.

## వృషభం



కుటుంబ సమేతంతా దైవదర్శనం చేసుకోవాలన్న ఆలోచనలు కలిసి వస్తాయి. కార్యక్రమాలలో పురోగతి కోసం సహ ఉద్యోగుల సహాయం ఆశిస్తారు. డయాగ్నొస్టిక్స్ సెంటర్ల నిర్వాహకులకు అనుకూలం. మధ్యవర్తిత్వానికి ప్రాముఖ్యతనిస్తారు. వివాహ విషయంలో మధ్యవర్తిత్వం వహిస్తారు. కొన్ని కార్యక్రమాలను విజయ పథంలో నడిపిస్తారు.

## మిథునం



శీతల పానీయాలు, విదేశీ ఉత్పత్తుల పట్ల ప్రభావిత మైన పిల్లలను మందలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కుటుంబపరమైన బరువు బాధ్యతలు మరింతగా పెరుగుతాయి. దూర ప్రాంతంలోని మీ వారి భద్రత పట్ల, ఆరోగ్యం పట్ల దృష్టి కేంద్రీకరించవలసి వస్తుంది. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. నూతన కార్యక్రమాల పట్ల మక్కువ కనబరుస్తారు.

## కర్కాటకం



జీవితాశయాలను, లక్ష్యాలను సాధించడం కోసం ప్రయత్నిస్తారు. నూతన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. దైవ చింతన, ఆధ్యాత్మిక కార్యక్రమాల ఆసక్తి కనబరుస్తారు. ప్రచారాలు, సమావేశాలు, సభల పట్ల మక్కువ కనబరుస్తారు. ఆ ఏర్పాట్లలో నిమగ్నులవుతారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది.

## సింహం



నూతన కోర్సులు చేపట్టి విజయం సాధిస్తారు. పోటీ పరీక్షల్లో స్వల్ప అపశృతులు చోటు చేసుకుంటాయి. జీవితాశయాన్ని సాధించడం కోసం అందరికీ దూరంగా ఉండి లక్ష్యసాధనే ధ్యేయంగా కృషి చేస్తారు. కుటుంబంలో మరొకరి ఆదాయం పెరగడం సంతోషం కలిగిస్తుంది. అనుకోని శుభ కార్యాల వల్ల ఖర్చులు అధికమవుతాయి.

## కన్య



విందు-వినోదాల్లో పాల్గొంటారు. కార్యాలయంలో నూతన సహోద్యోగులతో సఖ్యతగా మెలగుతారు. మీకు లభించని ప్రోత్సాహం వారికి అందిస్తారు. కొత్త సమస్యలతో సతమతమవుతారు. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఆ బొట్టు ధరించండి. ఇతరులు బాగుపడడం మీ మనసుకు నచ్చుతుంది.

## తుల



నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. కోర్టు వ్యవహారం, తీర్పులు మీకు అనుకూలంగా మారతాయి. ఎంత బాగున్నప్పటికీ మరింత కష్టపడాలి, అప్పుడే ఏ ముప్పు వాటిల్లదు.. అన్న భావనతో ముందుకు నడుస్తారు. జీవిత భాగస్వామితో విభేదాలు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు సంయమనంతో ముందుకు నడుస్తారు. సమయస్ఫూర్తితో ప్రవర్తిస్తారు. పూజలో నాగబంధం కుంకుమను ఉపయోగించండి.

## వృశ్చికం



ఏ ప్రయోజనం లేని వ్యక్తులను కూడా చేరదీస్తారు. వారికి అభయ హస్తం అందిస్తారు. వాళ్ల ద్వారా ఇంట్లో గొడవలు ఏర్పడతాయి. కనుక వీళ్లని ఏదో ఒక విధంగా మంచి మార్గంలో నడిపించాలి, విద్యాబుద్ధులు అబ్బే విధంగా వీళ్లని తయారు చెయ్యాలన్న ఆలోచనలు ముడిపడతాయి. క్రియేటివిటీ రంగంలో వున్నవారికి అనుకూలం. క్రీడల్లో విజయాలు సాధిస్తారు. ప్రతిరోజూ దేవతలకు ప్రథమ తాంబూలం సమర్పించండి.

## ధనుస్సు



అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండండి. కళా, సాంస్కృతిక రంగాల్లో వున్నవారికి నూతన అవకాశాలు, విదేశాలలో పని చేసే అవకాశాలు కలిసి వస్తాయి. మీ చేతుల మీదుగా కొంత మందికి సహాయ సహకారాలు అందిస్తారు. ధన రూపంలో మాత్రం ఏ బాధ్యతలు తీసుకోరు. కార్యాలయంలో నూతన ప్రాజెక్టులు అందుకుంటారు. గౌరీదేవిని అష్టోత్తరంతో పూజించడం శుభప్రదం.

## మకరం



వెస్ట్రన్ దేశాల ప్రభావం వల్ల పిల్లల్లో కలుగుతున్న మార్పులు, పెద్దల్లో కలుగుతున్న మార్పులు భయం కలించేలా ఉంటాయి. ఎంతో తెలివితేటలు వున్నప్పటికీ మంచి అవకాశాలు చేయి జార్చుకుంటారు. నూతన గృహం కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు చేస్తారు. అనుకున్న గృహానికి తగిన ధనం సమకూర్చలేక అవస్థపడతారు. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయడం మంచిది.

## కుంభం




ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో స్వల్పమైన చికాకులు, మనస్పర్థలు ఏర్పడవచ్చు. మీ వైపు నుండి ఏమాత్రం తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తారు. తల్లి తరపు బంధువులతో సాధ్యమైనంతవరకు మాట పట్టింపులకు పోకుండా వారికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తారు. స్నేహితులతో కలిసి నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

## మీనం




వ్యాపారాలు మొదలు పెట్టాలని కఠినమైన, మంచి సంకల్పం చేసుకుంటారు. ఆస్తులకు సంబంధించి అయినవాళ్లతో పోరాటం చేయాలన్న ఉద్దేశం/మనస్తత్వం ఉండదు. ఈ నేపథ్యంలో కొన్ని కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. పాత వాహనాన్ని స్నేహితులకు/తెలిసినవారికి అమ్మేసి, నూతన వాహనం కొనుగోలు చేయాలని ఆలోచిస్తారు. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని అర్చించండి.


ఈ వారం కా'ర్ట్యూన్స్'




MD చదవడానికయ్యే డబ్బులతో ఈ హాస్పిటల్ పెట్టి MD అయ్యాను ..... MD చదివిన పది మంది డాక్టర్లకు ఉద్యోగాలిచ్చాను....!!
MD- మేనేజింగ్ డైరెక్టర్.
సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్.

జ్ఞాపకాల్ని సమాధి చెయ్యాలా? మరి వాటి 'అంతిమయాత్ర' కూడా నిర్వహించాలా?!
సైకియాట్రిస్ట్.

ఆక్కోడి మాదిరి అడుగుతావేం? నా జీవితం లో ఎప్పుడైనా ఓడిపోయిన పార్టీలో ఉన్నానా..?!







కెనడాలోని క్లిలుక్ సరస్సు వేసవిలో నీలం, పసుపు, గోధుమ, ఆకుపచ్చ.. ఇలా వివిధ రకాల చిన్న చిన్న సరస్సులుగా ఏర్పడుతుంది. మెగ్నీషియం, సల్ఫర్, కాల్షియం సల్ఫేట్, సోడియం మొదలైన ఖనిజాలు ఇక్కడి నీటిలో ఎక్కువ శాతం ఉన్నాయట. ఆయా ఖనిజాల నిష్పత్తిని బట్టి నీటి రంగు మారుతుంది. రంగు రంగుల ఈ సరస్సుల చెంత ఫొటోలు దిగడానికి ప్రజలు క్యూ కడతారనటంలో వింతేముంది?







